# 1. దైవ సన్నిధి

"నాయొద్దకు వచ్చువానిని నేనెంతమాత్రమును బయటికి త్రోసివేయను" యోహాను 6:37.

ప్రభువునందు ప్రియులారా! మీకు శుభములు కలుగును గాక!

**వివరము:-** దైవ సన్నిధిలోనికి ఎవరుబడితే వారు; ఎప్పుడుబడితే అప్పుడు బిడియము లేకుండ వెళ్ళుటకిది గొప్ప ఆధారమైన వాక్యము. పాపి, గొప్పపాపి, మారుమనస్సులేని పాపి, పాపవిసర్జన చేయలేననుకొను పాపి, మంచిచెడ్డలు తెలిసినను తెలిసినట్లుగా నడవలేని పాపి, ఇంకను ఏవిధమైన పాపియై యుంటే ఆ పాపి ధైర్యముగా దైవసన్నిదిలోనికి వెళ్ళవచ్చును. కృపా ద్వారము ప్రతివారికి నిత్యము తెరువబడియున్నది. "ఉన్నపాటున వచ్చుచున్నాను" అను కీర్తనలో యున్నట్లు సిద్ధపడకపోయినను వెళ్ళవచ్చునని గలదు. నేరస్థుడైయున్న అపరాది స్నేహితునియొద్దకు వెళ్ళుటకు బిడియపడుచున్న యపరాధి అధికారులయొద్దకు వెళ్ళుటకు బిడియపడుచున్న యపరాధియైనట్టి పాప సహితము సన్నిధిలోనికి వెళ్ళవచ్చును. నరులుగాని, పరలోక వాస్తవ్యులుగాని, దూతలుగాని మీ తట్టు చూచి యింతగొప్ప దుస్థితిలో ఉన్న నీవు యే ముఖము బెట్టుకొని సన్నిధికి తగుదుననుచు వెళ్ళుచున్నావనియనిన యెడల ఆ పాపి కండ్లు, నోరు ఒక చేతితో మూసికొని చూపుడు వ్రేలితో ఈ వాక్యము తట్టు చూపించుచు సన్నిధిలోపలికి వెళ్ళవచ్చును. అసలు దేవుడే సెలవిస్తే మీరెవరు అడ్డము చేయుటకు? ఈ వాక్యములో అందరనిలేదు. ప్రయాసపడి భారము...మీకు విశ్రాంతి కలుగజేతును (మత్తయి 11:28). ఈ వాక్యములో అందరనికలదు. గాని ఈ వాక్యములోలేదు (యోహాను 6:37). అందరిని ఒకే పర్యాయము రండని చెప్పితే అందరికి చెప్పినాడు గాని ప్రభువు మాకు చెప్పలేదని కొందరందురు గనుక ఈ శుభలేక యొక్కరికిని యుద్దేశింపబడినది గనుక సన్నిధికి రాకుండుటకు మిష దొరకదు ఎందుకనిన ఫలానివారు రావచ్చును ఫలానవారు రాకూడదని వివరములేదు.

# ౨.

## " అడుగుడి మీకియ్యబడును. వెదకుడి మీకు దొరుకును తట్టుడి మీకు తీయబడును".

ప్రార్థనపరులకిది ప్రేరేపణగలవాక్యము. సన్నిధిలోనికి వచ్చి మౌనముగా యుండవచ్చును. ఇది అతనిచేత మాట్లాడించే వాక్యమై యున్నది. ఏమి యడగవలెనో ఈ వాక్యములో వివరములేదు. గనుక దైవసన్నిధిలోనికి వెళ్ళి ఏదైన యడగవచ్చును. ఏమి యియ్యబడుననే వివరములేదు. గనుక అడిగినదెల్ల ఇవ్వబడుననే నిరీక్షణ కలుగవచ్చును. **"అడుగుడి"** యనెడి మాట యందరికి సుళువుగా తెలిసిన మాట, అడుగుటనే క్రియ అందరు చేయగలరు తీరా మీరడిగిన తరువాత ఇదెందుకు యడిగినావని ప్రభువు అనరు. ఒకవేళ ఎవరైనా అడిగిన తరువాత ఈ వాక్యమును చూపించవచ్చును. ప్రభువు సామాన్యమైన మాటలలో గొప్ప వేదాంతమును చెప్పెను. మీరడుగరు గనుక పొందరని (యాకోబు 4:2)లో వ్రాయబడుటనుబట్టి అడుగనివారు చాలామంది యుండవచ్చును. నేను పది దినముల నుండి తిరుగుచున్నను ఇవ్వబడలేదని యొకరనినపుడు మీరడుగుట పూర్తి కాలేదని బోధకుడు జవాబు చెప్పవలయును. దైవవాగ్దానములు ఎల్లప్పుడు పూర్తిగానే యుండును. అన్ని కాలములలో ఒకేరీతిగానే యుండును. మీరెంతో పవిత్రులైయుంటేనేగాని మీరడుగరాదని యొకరనుచున్నారు. జవాబు: ఆమాట వాక్యములో లేదు యడుగుటకేమి యాటంకమున్నదో యది తీసివేయమని మొదట అడిగి ఆ పిమ్మట కావలసినవి యడిగినయెడల మీరడుగుట పూర్తియగును. మరియు మన ఏర్పాటు ప్రకారము ప్రార్థన మెట్ల వరుస ననుసరించి యడుగుటయే పూర్తియైన యడుగుటయై యున్నది. తమ తల్లిదండ్రులను పిల్లలు ఏదైన అడిగినప్పుడు దేశ జనులు అధికారులకు అర్జీ పెట్టుకొను రీతిగా అడుగరుగాని సూక్ష్మపద్ధతిని చనువు చొప్పున

అడుగుదురు గనుక వారడిగినది పొందుదురు. అలాగుననే మనమును మన తండ్రియైన దేవుని నట్లే యడుగవలయును. ఇయ్యబడుటయొద్ద మన ప్రభువు యున్నారు. ఈ రెండు మాటలయొద్ద మనిషియొక్క అడుగుటనేది నెరవేర్చును. ప్రభువు ఇచ్చుటనే నెరవేర్చును. ఒకే స్థలములోనే యున్నవి. ఉదా:- ఒక చిన్న అబ్బాయి తండ్రి గదిలోనికి వచ్చి నాయనా! నాకొక టావు కాగితము కావలెనని యడిగి వెంటనే డ్రాయరు తెరచి ఆ కాగితము దొరకినదని చెప్పి పట్టుకొని వెళ్లును. డ్రాయరు తెరచి ఆ కాగితము దొరికినదని చెప్పి పట్టుకొని వెళ్లును. అందుకు తండ్రి సంతోషించును. ప్రియులైన పిల్లలు ప్రియుడైన తండ్రిని వేడుకొను రీతిగా అడుగవలెనని డాక్టరు మార్టిన్ లూథరు చెప్పుచున్నాడు.

## 3.

**"అందుచేత ప్రార్థన చేయునప్పుడు మీరు అడుగుచున్న వాటినెల్లను పొందియున్నామని నమ్ముడి. అప్పుడు అవి మీకు కలుగునని మీతో చెప్పుచున్నాను" మార్కు. 11:24.**

ప్రభువు ఈ వాక్యములో నాలుగు యంశములను గురించి తెలియజేయుచున్నారు. 1) ఒక అంశమును గురించి ప్రార్థన చేయుడి 2) అది నెరవేరదు 3) నెరవేరకపోయిందని ఊహించి అదనముగా నమ్మివేయండి. 4) అప్పుడది నెరవేరును. ఈ వాక్య ప్రకారము చేయవలసినప్పుడు ఒక ప్రశ్న లేచును. నెరవేరనిదే నెరవేరినదని నమ్ముట అబద్దముగాదా? నరదృష్టికి అబద్ధమేగాని దైవదృష్టికి సత్యమైయున్నది. ఎందుకనగా నెరవేర్పు తండ్రికి కనబడును. మరియు ఈ వాక్యప్రకారము చేసేటప్పటికి మన శరీరబలము, జ్ఞానబలము ఉడిగిపోవును. ఎంత కష్టము. జబ్బుచేత బాధపడుచున్న రోగినిచూచి నీ జబ్బు పోయినది. దేవునికి స్తోత్రమని చెప్పగలడా? ఇది శరీరనైజమునకు అసాధ్యమైనను యత్నింపవలెను. ఎప్పుడు

నమ్మవలెనని వాక్యములో యున్నది? అడిగినప్పుడే నమ్మవలెను. అడిగినాము గనుక నమ్మవలెను. అడిగితే అది వేరే సంగతి. ఎందుచేత ముందుగా నమ్మవలెను? ప్రభువు చెప్పినాడుగాని నాకు నెరవేర్పు కనబడడములేదు. నాకు దర్శనము రావడములేదు. కలలు రావడములేదు. నమ్మకము తోచలేదని ఒకరనవచ్చును. దానికికూడ ఇదే జవాబు ప్రభువు చెప్పియున్నారు. మన నమ్మికవేరు ప్రభువు నమ్మికవేరు. మన నమ్మిక కదలిపోవును. కుమారుని ప్రభువునొద్దకు తీసికొనివచ్చిన తండ్రి ఏమని ప్రార్థించెను. ప్రభువా! నమ్ముచున్నానుగాని అపనమ్మిక కలుగకుండ సహాయపడుమని ప్రార్థించెను. మనము ప్రార్థించునప్పుడు ఈ వాక్యము చెప్పినాడు గనుక ఆయన నమ్మికమీద ఆనుకొనవలెను అది ఆయన నమ్మికను వాడుకొనుటయైయున్నది.

# 4.

**"నీవు ప్రార్థన చేయునప్పుడు నీ గదిలోనికి వెళ్లి తలుపు వేసికొని రహస్యమందున్న నీతండ్రికి ప్రార్థనచేయుము. అప్పుడు రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును." మత్తయి 6:6.**

1. సంఘములో ప్రార్థనకూటము జరుపుట అనగా బహిరంగ కూట సమాజము గురించి బైబిలులోనున్నది. అపో॥కార్య॥ 2:1అట్లే 2. ఏకాంత ప్రార్థనను గురించికూడ కలదు అనగా ఒక్కొక్కరు ఎవరికి తెలియకుండా ప్రార్థనచేసికొను ఏర్పాటుగలదు. ఇది ఈ వచనములో నున్నది. ఇద్దరు ముగ్గురు కలిసిచేసే ప్రార్థన. మత్తయి 18:16-20లో నున్నది (యోహాను 1:48-50) నతానియేలు అంజూరపుచెట్టు క్రింద చేసినది ఏకాంత ప్రార్థన, అపో॥కార్య॥ 10 అధ్యా॥లో కొర్నేలీ ఇంటిలో ప్రార్థన, మందితోకూడి రహస్య విషయములనుగూర్చి ప్రార్థించుటకు బిడియపడుదురు. కాబట్టి మన అంశ వచనము చాలాముఖ్యము. చూచుతండ్రియని యున్నది. వినేతండ్రియని వ్రాయవచ్చును.

మనస్సులోపలచేసే ప్రార్ధన గనుక చూచే తండ్రియని వ్రాయబడినది. తలుపువేసికొంటే హృదయములో ప్రార్ధనచేస్తే ఎవరికి తెలియదు, 3. హృదయ ద్వారములు మూసినను మన హృదయములోనికి తొంగి చూడగలడు కొన్ని ప్రార్ధనలకు స్వరములేదు. 1) తలంపులు 2) హృదయము 3) నోరు మూయబడినవి. తండ్రి హృదయము లోపల ఏయే మూల్గులు గందరగోళములు ప్రయాసములు జరుగుచున్నవో చూడగలడు. ప్రతిఫలము దొరుకుననగాయేమి? ఎంత కష్టమున్న లోపట లోపటనే ప్రార్ధనచేసిన వ్యర్ధముకాదు. వ్రాత స్వరములేని అర్జీకీ జవాబైయుండును. నాకొరకు ప్రార్ధించుము, ఇంకొకసారి చెప్పుచున్నాను నా కొరకు ప్రార్ధనచేయండని యడిగిన కొందరు ప్రార్ధన చేయరు. మీరైన చేయండని యనినను కొందరు చేయరు. చేయునట్లు ఋజువేమి? వారికి ఆదరణలేదు. నెరవేర్పులేదు గనుక మన యంశప్రకారము, ప్రార్ధన చేయవలెను. ఫలము దొరకదు ఏకాంత ప్రార్ధనలోకూడ ఇద్దరుందురని యొక బోధకుడనుచున్నాడు మానవుడైన యేసుప్రభువును నీవును తండ్రియెదుట మోకరించెదరు. కావున నెరవేర్పునకు ముందు గదిలో గలిగే ఆదరణయే మొదట నెరవేర్పు నాయకులు కూటములను జరుపునప్పుడు మనోనిదానము కలిగియుండవలెనని చెప్పుచు మీ హృదయ ద్వారములు మూయండి.

వెనుకనున్న శబ్దములు మీకు వినబడకుండ లోపలికి మంచి తలంపులుగాని చెడ్డతలంపులుగాని రాకుండ మూయండి. ఏకాంత ప్రార్ధనలో తండ్రి సహవాసము దొరుకును యేసుప్రభువు అట్లే చేసెను. పేతురు భోజనము సిద్ధమగుచున్నపుడు యుప్పెలో మేడలో ఏకాంత ప్రార్ధనలో నుండెను. భక్తులందరట్లు చేసిరి. అప్పుడు సంపూర్ణ తృప్తి కలుగును. ఒకరు ధ్యానములో మనము పాల్గొనలేము. ఎవరి ధ్యానము వారిదే. సాధు సుందరసింగు దినమంతయు ధ్యానములో యుండగ ఆయనను చంపవలెనని వచ్చిన శత్రువులు విసిగికొని వెళ్ళిపోయిరి.

# 5.

**"దేవుడు తాను ఏర్పరచుకొనిన వారు దివారాత్రులు తన్నుగూర్చి మొర్రపెట్టుచుండగా" వారికి న్యాయము తీర్చడా! లూకా 18:7.**

ఈ వాక్యములో యొక జనాంగముగలదు. ఏర్పరచుకొనిన వారే ఆ జనాంగము క్రైస్తవసంఘ స్థానమునకు ముందు యూదులు ఏర్పాటు జనాంగము అయితే ఇప్పుడు క్రైస్తవులు ఏర్పాటు జనాంగముగా కనబడుచున్నారుగాని యీ వాక్యములో నున్నది యదికాదు. విశ్వాసులందరు అనగా ఏకాలపు వారైననుసరే ఏ జనాంగము వారైననుసరే ఏర్పాటు ప్రజలైయున్నారు. ఏర్పరచబడి యున్నారు. కాబట్టి వారు మొర్రపెట్టక మానరు. ఎందుకనగా మొర్రపెట్టుట వారినైజమైయున్నది. వారొక్కరోజున మొర్రపెట్టి ఊరుకొనరు గాని దివారాత్రులు మొర్రపెట్టుదురు. దివారాత్రులనేది కూడా వారి నైజమైయున్నది. వారి నైజము రెండవమాటలోనికి వెళ్ళినది అవి ఒకటి దివారాత్రులు, రెండు మొర్ర, ఈ రెండు మొర్రలను బట్టి చూడగా వారి నిజముగా ఏర్పాటు జనమై యున్నారు. ఎవరైతే మొర్రపెట్టరో వారును ఎవరి మొర్ర, దివారాత్రులుండవో వారు ఏర్పాటులో యుండరు. పెండ్లికుమార్తె సంఘములో ఎట్లుండగలరు? ఒక రోజు మొర్రపెట్టి రెండవరోజున మొర్రబెట్టనియెడల ఎట్లుండగలరు? మొర్రబెట్టుటయొక్క ఉద్రేకము తగ్గిన యెడల ఎట్లుండగలరు. ఈ వాక్యములో ప్రార్థనయొక్క గొప్ప తీవ్ర ప్రార్ధనలుండి తీరవలెను. సామాన్య ప్రార్థన ఎప్పుడు తీవ్ర ప్రార్థనలోనికి వెళ్ళును? శ్రమకాలమందే ఒక మూలను చేరి నేను మొర్రబెట్టుచున్నాను నా మొర్ర దివారాత్రులున్నదా అను ఈ రెండు ప్రశ్నలు వేసికొనినప్పుడు వధువు శాఖోకాదో బయలుపడును. ఏర్పాటులో లేనివారు ప్రార్థన చేయుదురుగాని బద్ధకింపరు. నాలుగు పగళ్లు నాలుగు రాత్రుళ్ళు ప్రార్థన బాగుగా సాగవచ్చును అటు తరువాత సాగదు.

అప్పుడేమందురు. నేనెంత ప్రార్థన చేయబోయినను వాలుకుదరదు అని అందురు. అదే గుర్తు మధ్యమధ్య కుదర వచ్చునుగాని, ఏకరీతిగా వాలుకుదరదు. ఏర్పాటు ప్రజలగు వారిలోనుండి ఏర్పాటు ప్రజలగు క్రైస్తవులలో నుండియు విశ్వాసులు వచ్చిరి. గనుక ఏమి తేలినది విశ్వాసులే ఏర్పాటు జనమని తేలినది. అనగా నామక యూదులుకారు శరీరరీతిగా అబ్రాహాము సంతతికాదు. నామక క్రైస్తవులు కారు. అనగా బాప్తిస్మము పొందిన వారుకారు. అనగా అబ్రాహామువంటి విశ్వాసముగలవారే ఏర్పాటు జనాంగము యూదులు ఏర్పాటు జనాంగము. క్రైస్తవులు ఏర్పాటు జనాంగము విశ్వాసము లేకపోతే ఆ ఏర్పాటునకు విలువరాదు, మొర్రపెట్టుట ప్రార్థించుటకాదు, అడుగుటకాదు, ఏడ్చుట, ప్రాధేయపడుట మొర్రపెట్టుట కేకవేయడం అందురు. ఆపదలోనున్నప్పుడు పెద్దకేకవేసి ఎవరినైనను పిలుతురు. ఒకేసారికాదు. అనేక పర్యాయములు పిలుతురు. విశ్వాసులుకూడ అనేక శ్రమలు పొందుచున్నారు.. గనుక కేకలువేతురు. ఇశ్రాయేలీయుల దాసత్వములో బాధపడు చున్నప్పుడు దేవునికి మొర్రబెట్టిరి. అప్పుడు దేవుడు మోషేను పంపెను. ఎవరికి మొర్రపెట్టుట అని వ్రాయబడియున్నది? జవాబు:- దేవునికి మొర్రబెట్టుటను గురించి వ్రాయబడియున్నది దేవుడనుమాట ఇక్కడ ఉదహరించబడినది. ఈ మాట అన్ని జనాంగములకు సంబంధించిన మాట. ఏర్పాటు విశ్వాసులు అన్ని జనాంగములలో నుండి వచ్చుచున్నారు. పరలోకమునకు చేరవలసిన గడియమును లెక్కయును వచ్చినప్పుడు వీరు యూదులా? క్రైస్తవులా? అను ప్రశ్నలకంటే వీరు విశ్వాసులా? అవిశ్వాసులా? అనే ప్రశ్నలెక్కలోనికి వచ్చును.

న్యాయముతీర్చడా? అనే వ్రాయబడియున్నది. ఈ ఉపమానములో ఒక స్త్రీకిని మరియొకరికిని ఒక వివాదముగలదు. న్యాయకర్త ఉభయపక్షమునకు న్యాయము తీర్చునని యున్నది 1)

ఎంతభక్తిగా నడుచుకొనవలెనని యున్నను, అపవాది సైన్యము మనకు అడ్డము వచ్చుచునేయున్నది.

2) మనస్సు ఎంత నిబ్బరము చేసికొనవలెనన్న శోధనవల్ల ఆకర్షణ కలుగుచున్నది. అందుచేత కీడు కలుగుచున్నది.

3) మానవులతో కొందరు విరోధులై నిందరుమోపుచున్నారు ఇతరమైన కీడుకూడ చేయుచున్నారు.

1. షరా:- దేవుని సింహాసనము యొద్దకు విశ్వాసులు ఈ మూడు కేసులను తీసికొని వెళ్లుచున్నారు. విశ్వాసులు కేసు తీసికొని వెళ్ళిన మెదటిరోజు మొదలుకొని చివరిదినము వరకు చాలా దినములు గడచిపోవచ్చును. అనగా దివారాత్రులు దేవుడు మన మనవి విననట్లు కన్పించునుగాని తుదకు వినును. అన్యాయస్థుడైన న్యాయాధిపతియే న్యాయము తీర్చెనుగదా! న్యాయస్థుడైన దేవుడెందుచేత న్యాయము తీర్చడు ఇది మనము నేర్చుకొనవలసిన విషయము. గ్రహించుకొనవలసిన విషయము, గనుకనే ఈ ఉపమానములో న్యాయము అనుమాట ఉదహరింపబడినది.

షరా:- ఈ సందర్భమున ప్రకటనలోని ఒక విషయము జ్ఞప్తికి తెచ్చుకొందుము. అదేదనగా హర్మెగెద్దోను యుద్ధ సమయము వరకు (ఆదాము పతన కాలముండి సాతానును అతని సైన్యమునకు నర శత్రువులకు, విషపురులకు, జంతువులకు మనలను శోధించేటందుకు సమయమియ్యబడినది. అయితే హర్మెగెద్దోను యుద్ధ సమయమందు సాతానును బంధింపబడి యున్నది. 2) అంతెక్రీస్తు నరకములో వేయబడును 3) అబద్ధ ప్రవక్త అగ్నిగుండములో వేయబడును 4) పిశాచములన్ని నరకములో వేయబడెను. 5) శోధించే మారుమనస్సు లేనివారందరు గతించిపోయిరి 6) విషపురుగులు జంతువులు అను వాటిలోని హానిచేయు లక్షణము విషము తీసివేయబడును. 7) భూమి

యావత్తును ముళ్ళుముట్రలు మనిషికి హానిచేసెడి వస్తువులు శుభ్రము చేయబడెను.

2. షరా:– కాబట్టి మనుష్యులను శోధించేవి ఉండవు. గనుక భక్తిగా నడుచుకొనుట సుళువు. ఆహా అంతయు కష్టమే. ఆదాము మొదలు హర్మెగెద్దోను ఈ కాలమంతయు విశ్వాసులు దేవునిని ఆ స్త్రీవలె మొఱ్ఱబెట్టుచున్నారు. ఏమని? దేవా! మమ్మును శోధించేవాటిని తొలగింపుము (ఆదాము నుండి హర్మెగెద్దోను వరకు) మీ మొఱ్ఱ నెరవేర్పును పొందదు. ఆ తరువాత నెరవేర్పును పొందుదుము.

3. న్యాయము గుర్తింపగలము 1) శిక్షాన్యాయము 2) ప్రార్థన న్యాయము అనగా పాపము చేసినందుకు శిక్ష అనుభవించుట న్యాయము, అయితే ప్రార్థన చేసినందువలన శిక్షలు తొలగుట న్యాయము తన కుమారుని ఇచ్చుటవలన తనకు తానే ఇచ్చివేసికొన్నట్టే మనము ఈలోకములో సంపాదించుకొనే ఈవులన్నియు తనకుమారుని తరువాతవే. ఇవి ఆయనకంటే తక్కువే. ఆయనే సమస్తమైయున్నాడు. మరియు ఆయనను ఇచ్చివేయుటవలన అన్నియు ఇచ్చివేసినట్లే. దేవుడు వెనుక తీయలేదని వ్రాయబడియున్నది. పాపాత్ములయొద్దకు నా కుమారుని పంపడమెందుకు? అశుభ్రతతో నిండియున్న భూగోళమునకు నాకుమారుడెందుకు? దయ్యములపనియున్న ప్రపంచమునకు నాకుమారుడెందుకు? నా కుమారుని అంగీకరింపనివారును, తృణీకరించువారును, హింసించువారును ఉన్న ప్రపంచమునకు నా కుమారుని పంపడమెందుకు? అని దేవుడు అనుకొని పంపకుండ ఉ ండుట న్యాయమే, పంపనియెడల ఆయనను అనేవారులేరు. అయినప్పటికిని ఆయన పంపించినాడు. వెనకతీయలేదు. భూలోకములో ఒక్క కుమారుడే కలిగియున్న తల్లిదండ్రులు అతనిని అపాయకరమైన స్థలమునకు పంపక వెనుకతీయుదురు. లోకపుత్రులకంటే ఘనుడైన ప్రభువును పంపుటకు దేవుడు వెనుక తీయవలసినదే. దేవుడట్లు చేయలేదు. మరియు మన అందరికొరకు ఆ కుమారుడు

అనుగ్రహింపబడెనని వ్రాయబడియున్నది. అందరికొరకనేమాట సర్వజన లోకైక రక్షకుడనే భావము వెల్లడించుచున్నది. క్రీస్తు ప్రభువు ఒక పాలెస్తీనా దేశమునకేకాదు ఒక్క యూదులకేకాదు క్రొత్త నిబంధన యూదులకు క్రైస్తవులకుకూడ వ్రాయబడినది. కొందరికి రక్షకునివల్ల ప్రయోజనము తక్కువ. ఎటువంటి వారైనను సరే బైబిలులోని అందరికి అనేమాటలు చదువుకొనుట ఇష్టముగానుండునా దేవుడు తన కుమారుని అనుగ్రహించెననియు అప్పగించెననియు ఇందులో వ్రాయబడియున్నది. అనుగ్రహించుట అనగా ధర్మము చేయుట పుచ్చుకొనేవారియొక్క యోగ్యతనుబట్టి కాదు. ఇచ్చే ఆయన యొక్క యోగ్యతనుబట్టి అప్పగించుట అనగానేమి? ఈ పుస్తకము మీకు అప్పగించి వెళ్ళుచున్నాను అని ఒక గ్రంథకర్త ఒక విద్యార్థితో చెప్పెను. దానిభావమేమి? ఈ పుస్తకము నీవు చదువవలెను. దానిని అనుసరింపవలెను. ఇతరులకు బోధింపవలెను. కాగితము మూయకుండగను, చేతులు కొట్టకుండగను ఎవరయినా దొంగిలింపకుండగనుక పాడుచేయకుండగనుక జాగ్రత్తగా చూచుకొనవలెను అని చెప్పినట్లే అప్పగించుట అను మాటలో ఈ పూచీలన్నియు ఇమిడియున్నవి. అట్లే కుమారుడు మనకు అప్పగింపబడెను గనుక ఆయన విషయములో మనకు అన్ని పూచీలు గలవు.

## ౬.

**"ఆత్మయు మన దౌర్బల్యమును చూచి సహాయము చేయుచున్నాడు ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్థన చేయవలెనో మనకు తెలియదుగాని ఉచ్చరింపశక్యముగాని మూలుగులతో ఆ ఆత్మ తానే మన పక్షముగా విజ్ఞాపనము చేయుచున్నాడు. రోమా. 8:26.**

ఎ) ఆత్మ అనగా త్రిత్వములో యొక భాగము. అందుచేతనే తెలుగు బైబిలులో పెద్ద అచ్చు ఉన్నది. 'డు' అనే అక్షరమున్నది. విశ్వాసిలో దౌర్బల్యము గలదు. కాబట్టి ఒకానొకప్పుడు ప్రార్థనవాలు కుదరదు.

బి) దౌర్బల్యమనగానేమి? శ్రమ అధికముగా నున్నప్పుడును, ప్రార్థన కుదరనప్పుడును, ప్రార్థనకు త్వరగా నెరవేర్పు రానప్పుడును విసుగుదల పుట్టును. ఇక ప్రార్థన ఎందుకు చేయాలని అనిపించును. గనుక మనము ప్రార్థన కుదురుటకు బలవంతముగానైనను ప్రార్థనలోనికి పోవలెను. రాకపోతే సన్నిదిలో పడియుండవలెను. అప్పుడు ఆత్మ.........మన దౌర్బల్యము ఆత్మకు కనబడును.

సి) సహాయమనగానేమి?

ప్రార్థనాపరుడు తాను చేయగలిగినది చేయవలెను. అప్పుడు ఆత్మ అందించును. ఎంత గొప్ప ప్రార్థనచేసేవారికైనను ఒకానొకప్పుడు మందస్థితి కలుగును. నాకు ఈ సమయమున ఎవరైనా సహాయము చేసిన బాగుండునని అనిపించును. మనుష్యుల సహాయము కొంతవరకు పనికి వచ్చునుగాని, ఆత్మ సహాయము ఎక్కువైయుండును.

డి) యుక్తము అనగా నేమి?

సరియైన మాటలతో పరీక్షింపగల మనస్సుతో ప్రార్థించుట యుక్తమైయున్నది. మరియు అవసరమైన మాటలు పలుకకూడదు ముఖ్యముగా విసుగుదల మాటలు ఉచ్చరింపకూడదు.

ఇ) ఉచ్చరింప శక్యముగాని మూలుగు అనగానేమి?

ఒకడు మూల్గినప్పుడు అది వ్రాయుటకష్టము. మూల్గుట హృదయములోని పని 1) విజ్ఞాపనము అనగానేమి? యేసుప్రభువు తండ్రి కుడి పార్శ్వమున కూర్చుండి మనకొరకు ప్రార్థించుచున్నాడు. అందుచేత మనపక్షముగా నెరవేరవలసిన అంశములు నెరవేరుచున్నవి. ప్రార్థనాపరుడు ఫలానిది నా ప్రార్థనవల్ల నెరవేరినదని చెప్పకూడదు. అతనికొరకు చాలామంది ప్రార్థించి యుండవచ్చును. ఒకరి పక్షముగా ప్రార్థించే ప్రార్థన విజ్ఞాపన ప్రార్థనయని చెప్పవచ్చును. పరలోకమున ఆయన ప్రార్థించుచుండగా భూలోకమున ఆత్మ మనలోనుండి ప్రార్థించు చున్నది. ప్రభువు చేయునది స్వయముగాచేయు ప్రార్థన

ఆత్మచేయునది సహాయక ప్రార్థన ఏరీతిగానైన మన ప్రార్థన నెరవేర్చవలెననే ఉద్దేశ్యముతో ఈ ఏర్పాటు అనగా సింహాసనము నొద్ద యేసుప్రభువును, మనయొద్ద ఆత్మయును ప్రార్థన చేయుట కలిగియున్నారు. బొత్తిగా ప్రార్థన ఏమిటో తెలియనివారి నిమిత్తమై ప్రభువు ప్రార్థించును. ప్రార్థనచేయుట కొంత అభ్యాసముగలవారికి ఆత్మసహాయము చేయును. ఆత్మ చేయునట్టి ప్రార్థనకూడ విజ్ఞాపన ప్రార్థనయైయున్నది. విజ్ఞాపన కర్తలిద్దరు మనమెంత ధన్యులము నిర్లక్ష్యపరులమై యుండరాదు నిరాశపడరాదు, ఒకరి అంశములు గురించి నేను ప్రార్థించుచున్నాను, మరికొందరు ప్రార్థించు చున్నారు. ప్రభువు ప్రార్థించుచున్నారు, ఆత్మ ప్రార్థించుచున్నారని ప్రార్థనాపరుడు ధైర్యము తెచ్చుకొనవలెను ఇంతమందిచేసే ప్రార్థన కొట్టివేయబడునా? నిరాశపడుటకు సందులేదు ఒకానొకప్పుడు ఒక అంశముమీద ప్రార్థన పెట్టుకొంటే ఆపరాదు ఇంకొకటివచ్చును. ఏమని గ్రహించుకొనవలెను. మన అంశమును ఒక ప్రక్కనుబెట్టి ఆత్మ మరియొక అఇంశమును అందించెనని గ్రహించుకొనవలెను. కలెక్టరుగారి బల్లమీద నాలుగు అర్జీలు ఉన్నవి, చెంతను నిలువబడియున్న సహాయకారి మూడవ అర్జీ అధికారికివచ్చెను, ఆ అర్జీ ఆత్మ ప్రార్థన ప్రభువుయొక్క విజ్ఞాపన అందించును.

ఒక ఉపమానము:- ఒక స్త్రీ చనిపోతూ తన కుమారునివైపు చూస్తు పాదిరిగారును ఇతరులును చేయుచున్న ప్రార్థనలో ఏకీభవించడమే లేదు. అంతకుముందు పాదిరిగారు చెప్పిన మాటలు జ్ఞాపకము తెచ్చుకొనడములేదు. దీనిపేరు దౌర్భల్యములోనే గొప్ప సహాయము కలుగును. ఈ వాక్యము అట్టివారికే

## 7.

**దేవుని ప్రేమించువారికి అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము. రోమా 8:28.**

ఈ వాక్యములో యెరుగుదుమనే మాట యున్నందున ఈ వాక్యానుభవము కలిగియున్న ఒకరు వ్రాసినట్లు స్పష్టమగు చున్నది. వినే అనుభవముకంటే, చదివే అనుభవముకంటే, ఊహించే అనుభవముకంటే స్వయముగా ఎరిగియుండే అనుభవము గొప్పదైయున్నది. వినేటప్పుడు సంతోషము, చదివేటప్పుడు మరియొక సంతోషము ఊహించేటప్పుడు ఇంకొక సంతోషము, స్వయముగా ఎరిగియుండేటప్పుడు అన్నిటికంటే గొప్ప సంతోషము ఇదే క్రైస్తవులందరు అనుభవించెదరు. నేటి క్రైస్తవులకును, క్రైస్తవ బోధకులకును అపోస్తలులకును, బోధలో గొప్ప భేదము గలదు. మేము చూచినది ప్రకటించుచున్నామని అపోస్తలులు అన్నారు. నేటి క్రైస్తవులు అది అనలేరు. ఎందుకనగా వీరు క్రీస్తును చూడలేదు అయితే కొంతమంది క్రైస్తవులు క్రీస్తుయొక్క సన్నిధి అనుభవము పొందుచున్నారు వారు సాక్ష్యమియ్యగలరు. యెరూషలేము వీధులలో యేసుప్రభువును చూచినవారు అనగా అవిశ్వాసులు ఎప్పటికైనాచూచి అపోస్తలులతో సమానము కాగలరా! సాధు సుందరసింగుగారు తన స్వంత అనుభవము ఇట్లు చెప్పుచున్నారు ఎలాగనగా “మొదటివారు ప్రార్థనలో యేసుప్రభువు నా హృదయములో దిగుట నేను బాగుగా యెరుగుదును, ఆయన నాలోయుండి ఈ నాడు ఏ నిమిషమందైనను బయటికి వెళ్ళిపోలేదు మహా గొప్ప శ్రమ కాలమందు సైతము ఆయన నా హృదయములో నిజముగా నున్నట్లు బాగుగా తెలియును. ఊహకాదు విశ్వాసము కాదుగాని అనుభవమే. నేను పాడునూతిలో అసహ్యించుకొనేటప్పుడు చీకటిలో ఉన్నప్పుడును బాధపడు చున్నప్పుడును మరల నూతిపైకి వెళ్ళుదునను నిరీక్షణ లేనప్పుడును గాలిలేనప్పుడు అనగా ఊపిరి ఆడనప్పుడును సహితము ఆయన నాలో ఉన్నట్లు నాకు తెలియును, నాదేవా! నన్నెందుకు చేయివిడిచిచినావని కేకవేయు చున్నాను. అప్పుడును ఆయన నా హృదయములోనే యున్నాడు. ప్రియులారా! ఇది ఎంత గొప్ప

అనుభవము. ఇది మనకందరకు కలుగవలసిన అనుభవమైయున్నది. దేవుని ప్రేమించువారు అనగా ఎవరు? ఎవరు దేవుని ప్రేమించుదురో వారును మరియు దైవాజ్ఞలు అనుసరించేవారును, తాను సృష్టించిన అందరిని దేవుడు ప్రేమించుచున్నాడు అనే సంగతివేరు, తాను సృష్టించిన అందరిని దేవుడు ప్రేమించుచున్నాడు అనే సంగతివేరు ఆజ్ఞానుసారవర్తుల సంగతివేరు. వీరు ప్రత్యేకమైన కృపను పొందుటకు సిద్ధపడినవారు అట్టివారు దేవుడను గ్రహించు ఉపకారమును అందుకొనగలరు. అనుభవించగలరు. తక్కినవారట్లు చేయలేరు. దేవుడు ప్రేమించువారు ఏర్పర్చబడినవారైయున్నారు. వారు దేవునిని, దేవుడు వారిని ప్రేమించుకొనుటకు వీలగును అని చెప్పుట స్పష్టముగా నున్నది. దేవునిని ప్రేమించుచున్నానని చెప్పువాడు దేవుని చిత్తమును నెరవేర్చునప్పుడు అబద్ధికుడను. ప్రభువా! ప్రభువాయని చెప్పువారుకాదు నా తండ్రి చిత్తము చేయువారేయని యేసుప్రభువు చెప్పెను. ఇది గొప్ప సత్యమైయున్నది. దైవసంకల్పన అనగానేమి? 1) మేలు కలిగించుట 2) సమస్తము నెరవేర్చుట. ఈ రెండు విషయములుగలదే దైవసంకల్పన సమస్తమును సమకూడవలెను. ఆ సమకూడుట మేలైయుండవలెను.

షరా:- సన్నిధిలోనికి వెళ్ళినప్పుడిది తెలియబడును. ఏలాగనగా ఇష్టములేని ఒక కార్యము జరిగినప్పుడు విశ్వాసి అడుగును అప్పుడు జవాబు ఇట్లుండును. ప్రస్తుతమిది నీకు కీడుగా కనిపించును గాని ముందుగా మేలే.

దృష్టాంతము:- యోసేపు అన్నదమ్ములు కీడు ఉద్దేశించిరి కాని దేవుడది మేలుగా మార్చినాడు. యోసేపు ఐగుప్తుకు వెళ్ళకపోతే సోదరులకు అన్నమెక్కడిది. ఈ వాక్యములో గొప్ప ఆదరణగల మాటలుగల 1) మేలు 2) సమస్తమును కీడులేదు. యది ఒకటి సమస్తమనగా ప్రార్ధనలుయన్నియు నెరవేరును, సన్నిధిలోనికి

వెళ్ళువారికి ఇదే గొప్ప ఊతకర్ర. మేలు కలుగనప్పుడును సమస్తము నెరవేరనప్పుడును సన్నిధికి వెళ్ళిన ప్రయోజనమేమి? పనియనే ఆటంకపు బండ వచ్చినా నిద్రావస్తవచ్చినా, అలక్ష్యపు మనస్సువచ్చినా సన్నిధి మానవద్దు అదిగోమేలు, ఇదిగో సమస్తము ఆమేన్.

1. షరా:- పిలువబడినవారు ఎవరు? అందరిని దేవుడు పిలుచున్నా? నీపనిలోనికి వస్తాను, అనిచెప్పి రావిచెట్టు క్రిందకు 10మంది వస్తే నలుగురినే ఎవరిని పిలుచునో వారినే పనికి ఏర్పరచును, వారికి పనులు ఏర్పరచును ఎవరిని పనిలో పెట్టుకొనునో వారిమాట ప్రకారమే చేయును, వారి ప్రార్థనలు ఆలకించును. ఆలకించకపోతే పిలిచినా లాభమేమి? ఏర్పాటు చేసినాలాభమేమి? ఓ సువార్తికుడా నిన్ను ప్రభువు ఏపనికి పిలచెనో ఆపనికి రావలసినది. అడిగినప్పుడు ఇచ్చితీరవలెను. గనుక వెళ్ళుము సన్నిధికి ఆమేన్.

2. షరా:- ఒకవేళ కలుగకపోతేనో? సమకూడకపోతేనో? జరుగపోతేనో?

3. జీవితకాలమంతయు ఇదే వేదము మేలు! మేలే! మేలు!!!

జవాబు:- జరిగి తీరవలెను చిక్కు ఒక్కటి ఉన్నది, దేవుడు ప్రేమించుటలేదు మరియు ఆయన పిలువలేదు.

4. షరా:- జరుగకపోవుటమనేది ఈ వాక్యములో లేదు. కీడనేదిలేదు. సమకూడక పోవుటనేదిలేదు. కీడునుచూచి మేలు కలుగవచ్చునని యనుకొనుటలేదు. కేవలము మేలేయని ఉన్నది. ఇదే గొప్ప ధన్యత.

## 8.

**“నీవు సమస్త క్రియలను చేయగలవనియు నీవు ఉద్దేశించినది యేదియు నిష్ఫలము కానేరదనియు నేనిప్పుడు తెలిసికొంటిని” యోబు 42:2.**

అర్థము:- మనమెంత అసాధ్యమైన సంగతి ఎత్తి ప్రార్థించినను దేవుడు నెరవేర్చగలడని బోధించునట్టి వాక్యములలో యిదియొకటి.

గనుక ప్రార్ధనాపరులు నిరాశపడనక్కరలేదు. ఈ వచనములో రెండు భాగములు గలవు. 1) దేవుడు సమస్తమును చేయగలడు 2) దేవుడు చేయగోరి ఉద్దేశించినది యేదియు వ్యర్ధము కాదు.

షరా:- సమస్తమును చేయగలవాడు ఎవరై ఉండును? సృష్టికర్తయే ఆదిలో భూమ్యాకాశములను వాటిలో ఉండేవాటిని చేసినవాడు. ఆ తరువాత లోకాంతమువరకు చేయవలసిన పనులనుకూడ చేయగలడు. ఇది దేవుడు చేయలేడని అనకూడదు. దేవుడు అన్నియు చేయ కలిగినవాడైతే పాపము చేయగలడా? అని కొందరడుగుచున్నారు. భూమి, ఆకాశములు చేయుట శక్తియైతే పాపము చేయుటశక్తికాదు. అశక్తి గనుక శక్తిగల దేవుడు అశక్తిగల కార్యమును చేయడు, చేయలేడు. పాపము చేస్తే ఆయన శక్తిలేనివాడని అనిపించుకొనును. మరియు దేవుడు సాతానును మార్చగలడా? నరకములో పడేవారందరిని మార్చగలడా? అని కొందరడుగుచున్నారు దేవుడు వారికి స్వంత ఇష్టము అనగా స్వతంత్ర్యము అనే లక్షణమును ఇచ్చినాడు. కాబట్టి వారి ఇష్టము లేకుండా వారిగుణమార్పు విషయములో ఏమియు చేయడు. ఒకవేళ చేస్తే ఇచ్చిన స్వాతంత్ర్యమును (స్వతంత్రత) తీసివేసికొన్నట్టే అట్లు చేయుట అన్యాయము, అన్యాయమే పాపమగును అందుచేత చేయడు నామనస్సు మార్చుమని అడిగితే మార్చగలడు. దేవుడు సమస్తము చేయగలడు అనుమాటకు మరియొక అర్ధమేమి, మంచి కార్యమును మాత్రము చేయగలడు, న్యాయమైన కార్యమును చేయగలడు కష్టములను తొలగించగలడు. కావలసినవి ఇవ్వగలడు. క్రొత్తవి సృష్టించగలడు. ఇదియే దాని అర్ధము.

స్వాతంత్ర్యమను లక్షణములను తీసివేసిన ఏమగును? తీగెను తీసివేసిన డొంక అంతయును కదలును, అనగా స్వాతంత్ర్యము తీసివేసిన అన్ని మంచిగుణములు హరించిపోవును అదిపోతే నరులు నశించిపోదురు.

3) దేవుడుద్దేశించినది వ్యర్ధముకాదు దేవుడేమి ఉద్దేశించినాడు? రెండు సంగతులు గమనించండి 1) భూమ్యాకాశములను, దూతలను, నరులను కలుగజేయవలెనని ఉద్దేశించినాడు. ఇది నెరవేరినది. ఆటంకము కలుగలేదు. సృష్టియైన తరువాత ప్రతిదినము నూతన సృష్టిచేయ నుద్దేశించినాడు. నేడు నెరవేరుచున్నదిగదా! ఇంకా ఏమి ఉద్దేశించినాడు. నరుడు పాపములో పడినప్పుడు రక్షణ సంకల్పన నేర్పింపవలెనని నుద్దేశించినాడు. ఇదికూడ నెరవేరినది ఆటంకములు వచ్చినను నెరవేరినది. నేరములకు శిక్ష అని దేవునికి తెలియును ఇదికూడ నెరవేరుచున్నది. అన్నియు చివరకు నెరవేరును. పాపమునకు ఫలితము వచ్చుటచూచి దేవుడు ఊరుకొనునుగాని తీసివేయమని కోరేవారుంటే తీసివేయగలడు. కాబట్టి ప్రార్ధనాపరులారా! మీరు పట్టుపట్టి నమ్మకముతో చేసే ఏ ప్రార్ధనయు నిష్ఫలముకానేరదు. ఇది గొప్ప ఆదరణగలమాట.

# 9.

## నేను యెహోవాను సర్వశరీరులకు దేవుడను నాకు అసాధ్యమైన దేదైననుండునా? యిర్మీయా 32:27.

అర్ధము:- దీనిలో మూడు భాగములుగలవు. **1) యెహోవాను 2) దేవుడను 3) అసాధ్యముకాదు.** నేను యెహోవాను. ఈ మాట ప్రత్యక్షతగలమాట అనగా పాతనిబంధన ప్రజలకు తనను గురించి తెలియపర్చుకొన్న నామము ప్రత్యేకముగా ఆ జనాంగమునకు ఉపయోగించిన నామము రక్షకుడు జన్మింపవలసిన జనాఇగమునకు వెల్లడించిన నామము ప్రత్యేకమైన జనాంగమునకు ప్రత్యేకమైన నామమందు దేవుడు బైలుపడినాడు గనుక ప్రత్యేకమైన రీతిగా విశ్వాసులకు చేసిన సహాయముకంటే ఎక్కువ చేయగలడు. ప్రత్యేకము ప్రత్యేకమే ఇది విశ్వాసుల్దరికి ఆదరణపదము. **2) సర్వశరీరులకు దేవుడను** ఈ మాటలో లోకస్థులందరు ఇమిడియున్నారు. సర్వ

శరీరులనగా విశ్వాసులు అవిశ్వాసులు, అన్యులు, యూదులు. ఈ మాట సామాన్యమైన మాటయైయున్నది. దేవుడనుమాట అన్నీ జాతులవారు అన్నీ మతములవారు వాడుకొనే మాటయైయున్నది. యేసుక్రీస్తు అనేమాట ప్రత్యేకముగా క్రైస్తవులకు మాత్రమే వాడుకొనుమాట అయినను అన్ని మతములవారి యొద్ద రక్షణార్ధమై పంపబడుచున్నది. ఈ నామముననే రక్షణ అని చాటింపబడుచున్నది. యెహోవాయే దేవుడు వేరొక దేవుడు లేడని యూదులు చెప్పుకొన్నట్లు యేసే రక్షకుడని క్రైస్తవులు చెప్పుకొనుచున్నారు. దేవుడు యేసుక్రీస్తుగా ప్రత్యక్షమైనందున ఈ చెప్పుకొనుట నిజమైయున్నది. అనగా క్లుప్తముగా చెప్పవలెనంటే ఇట్లు చెప్పవలెను. ఎట్లనగా యూదులకు యెహోవా నామము క్రైస్తవులకు యేసుక్రీస్తు నామము, అందరికి కలిసి దేవుడను నామము ఇవ్వబడినట్లు కనబడుచున్నది. అయితే తక్కిన రెండు నామములు యేసుక్రీస్తులో ఇమిడియున్నవి. గనుక యేసు ప్రభువు రక్షకుడు మాత్రమేకాదు దేవుడునైయున్నాడు.

**3) నాకసాధ్యమైనదేదైనా యుండునా:–** నాకనగానేమి? ఇది ఏకవచనము? బహువచనముకాదు. క్రొత్త నిబంధన సిద్ధాంతమును బట్టి దేవుడు తండ్రిగాను, కుమారుడుగాను, పరిశుద్ధాత్మగాను బయలుపడియున్నాడు. అలాగైతే మాకు అని అనవలెనుగదా! ముగ్గురు వ్యక్తులు ఒకవ్యక్తిగా ఉన్నందువలన అట్లనుటకు వీలులేదు. ఒక్కొక్క వ్యక్తిపేరు వేరుగా మాట్లాడినప్పుడు కూడ ఏకవచనము వాడుబడును. బైబిలులో ఎక్కడను త్రిత్వమునకు బహువచనము వాడినట్లు కనబడదు గాని పరమ గీతములో బహువచన జాడ కనిపించుచున్నది. “అసాధ్యమైనది” అనగానేమి? నేడు చేయలేనిదని అర్ధము. ఇది నీవు సమస్తము చేయగల వాడవని అన్న మాటలకు సరిపోయినది దేవునికి ఎవరి ప్రార్థన నెరవేర్చుటకైనను అసాధ్యముకాదు అను తలంపుగల వాక్యములలో ఇది చదువుకొని కప్పిగంతుల వేయుదురు ఉన్నదా అని అంటే లేదనే జవాబేగాని ఉన్నదని జవాబు వచ్చుటకు వీలులేని

ప్రశ్నయైయున్నది. దేవా! నీవు అందరి దేవుడవు మా దేవుడవు, నా దేవుడవు కాబట్టి నీకసాధ్యమైనదేదియు లేదు. కాబట్టి నాకును ఇతరులకును అసాధ్యముగా తోచుచున్న ఈ కార్యమును నెరవేర్చుము అని ప్రార్ధనాపరులు ప్రార్ధింతురు. యిర్మీయా అనగా ఈ మాట వ్రాయించిన యిర్మీయాకు అన్నియు ఇక్కట్టులే దేవుడు వాటన్నిటిని తొలగించినాడు మనకుకూడ అనగా ఇది చదివే మనకుకూడ తొలగించునట్టి సహాయము చేయగలడు. నాకు అసాధ్యమైనది ఏదైనా యున్నదా? అను ప్రశ్న వినసొంపుగా నుండునా? నాకు అసాధ్యమైనది యేదియు లేదనియు సమస్తము సాధ్యమేననియు చెప్పగల నిశ్చయవాక్యము వినసొంపుగా నుండునా? యూదులు జన్మవిషయములోను మనము విశ్వాసి విషయములోను ప్రత్యేక జనాంగమైయున్నాము. తెలుగులో దేవుడను ఏక వచనమునకు బహువచనేలేదు. దేవుడు ఒక్కడే గనుక బహువచనమెట్లుండును! అసలు వ్యక్తిలోలేని బహువచనము మాటలో ఉండనేరదు. మాట్లాడుకొనేటప్పుడు సంభాషణలో మాకైతే ఒక్కదేవుడేగాని మీకు అనేక దేవుళ్ళున్నారు అని మాట్లాడుకొందురు. శాస్త్రము యుక్తముగా చూచిన దేవుళ్ళు తప్పు పదము. ఇది మనుష్యులకు అసాధ్యమేగాని దేవునికి సమస్తము సాధ్యము (మత్తయి 19:26).

# 10.

**"అలాగైతే ఎవడు రక్షణ పొందగలడని అడుగగా యేసు వారినిచూచి ఇది మనుష్యులకు అసాధ్యమేగాని దేవునికి సమస్తమును సాధ్యమన చెప్పెను" మత్తయి 19:26.**

ఈ వాక్యములో రెండు కథలు కన్పించుచున్నవి.

1) ధనవంతులు 2) ఒంటె. 1. దేవుని రాజ్యము సూదిబెజ్జము, ధనవంతుడు దేవుని రాజ్యములో ప్రవేశించుట అసాధ్యమట. బెజ్జములో లొట్టపిట్ట (ఒంటె) దూరుట సాధ్యమట ఇది మన తలకు

మించిన కథ. ఎక్కడ ఒంటె ఎక్కడ బెజ్జము? రక్షణ ఇందులోని విషయమైయున్నది. ఒక ఘోరపాపి తన పాప జీవితమును తలంచుకొని ఆలోచించినయెడల ఈ కథ నిజమని తెలియును. నేను మారుమనస్సు పొందలేకపోవుచున్నాను గనుక నాకు రక్షణలేదనుట నిశ్చయమే. పొందగలిగితే రక్షణ యున్నది. గాని నేను పొందలేకపోవుచున్నాను. రక్షణ యిచ్చుట దేవునికి సుళువేగాని నేను పొందుట అసాధ్యమని అతడొప్పుకొనును అతని దృష్టిలో ఎత్తైన గోపురము గల ఒంటెగలదు. అతనిదృష్టిలో కొండలవలె పెరిగియున్న పాపరాశి గలదు. ఆ ఒంటె బెజ్జములోనికి వెళ్ళగలదా? అంటే వెళ్ళవచ్చునని చెప్పవచ్చును. దేవుని రాజ్యములోనికి వెళ్ళగలవా అంటే అబ్బా ఎక్కడమాట అని చెప్పవచ్చును. ప్రభువు ఇచ్చిన జవాబు చిత్రముగా నున్నది. పాపియొక్క ఊహ వ్యతిరేకముగా నున్నది. నరులకసాధ్యము ఇది నిజమే. దేవునికి సాధ్యము ఇది నిజమే. ఈ రెండు వ్యతిరేక వృత్తాంతములను పొందుపరచుట ఎట్లు? నాకు వర్తమానము రావడములేదు. పాపికి అదిగొప్ప ఆదరణ వాక్యము. దేవా! రక్షణ పొందుట నాకు అసాధ్యముగానే కనిపించుచున్నది. నీకైతే సాధ్యమని కన్పించుచున్నది. గనుక రక్షించుమని గొప్ప పాపి ప్రార్థింపవచ్చును. నరునికి ఇది గొప్ప ఆధారమైన ఆదరణ వాక్యము.

ఒక వరుస జ్ఞాపకముంచుకొనవలెను. నరుడు ఎంత పాపియైననను రక్షణ ఆశగలిగిన పాపములో వృద్ధి పొందుచున్నప్పుడు అతని మారుమనస్సు నిమిత్తమై దేవుడు ఎంతో గడువిచ్చును. గనుక ఆ గడువులో అతడు ప్రార్థించినయెడల రక్షణ దొరకును. గడువు ఎట్టిదనగా ఆశను పెంపుచేసే గడువు. ప్రార్థన చేయించే గడువు రక్షణ యెరచూపించే గడువు. అతడు రక్షణ పొందేటందుకు ఎన్ని సాధనములు అవసరమో అన్ని సాధనలతోను దొంతలుగా నిండియుండే గడువు నరుడు రక్షణ పొందేటందుకు దేవుడు చేయవలసినవన్నియు నయానభయాన చేసితీరును. రవ్వంత ఆశ

కనపరచినయెడల అతడు బాగుపడును. అనగా బాగుపడుటకు దేవుడు సహాయము చేయును. నరుడు తన మనస్సులో అసాధ్యమనును దానికి జవాబుగా దేవుడ నాకు సాధ్యమే అనును. దైవికస్వస్థత గలవారికి రోగికిని జరిగే సంభాషణ వినండి. **బోధకుడు:–** నీ జబ్బు ఏలాగున్నది. **రోగి:–** కుదిర్చేవాడైతే ఇదివరకే కుదుర్చును. బోద:– ఇదివరకు సంగతి ఎందుకు ఇప్పటిమాట చెప్పుచున్నాను. వెనుకటిమాట మరచిపొమ్ము. కుదర్చగలడు. నీవు ముందుకు నడువగలవుగాని గతకాలమునకు అనగా వెనుకకు నడువగలవా? ఆ మాత్రము దానికి వెనుకటి సంగతి ఎందుకు ఎత్తవలెను. **రోగి:–** విశ్వాసముంటేనేగాని కుదర్చడని మీరే అంటారు. **బోధ:–** బాగా వినుట. ఆశ. ప్రార్థన ఇవన్ని నీకున్నవా? **రోగి:–** ఉండకేమి ఉంటే కుదుర్చునా? విశ్వాసము లేకపోతే **బోధ:–** విశ్వాసమును కుదుర్చును. అది వచ్చినపిమ్మట విశ్వాసమును కుదుర్చును! ఏరోగిలో ఆశ. వేడుకొనుటయుండదు?

షరా:– ఏ పాపిలో ఆశ వేడుకొనుట ఉండదు. ఇవి కలిగించిన వారెవరు? ఆయన నమ్మిక మాత్రము కలిగించడా? అందుమీద రక్షణ దయచేయును.

**2) వరుస:–** ఒక పాపికి ఆశ ఉండదు ప్రార్థన విశ్వాసములుండవు. ప్రయత్నములుండవు. అప్పుడవి కలిగించుటకు శ్రమలను దేవుడు రానిచ్చును బోధలకు పంపును. మంచి తలంపులను కలిగించును. వీటినిబట్టి విశ్వాసము కలుగును. రక్షణ దొరుకును.

**3) వరుస:–** ఆశ, ప్రార్థన, విశ్వాసము. ప్రయత్నము ఉండని పాపిసంగతిఏమి? కలిగించిన కలుగని పాపిసంగతియేమి? ఎంత చెప్పినను హృదయమును కఠినపరచుకొను పాపి సంగతి ఏమి? పైన ఉదహరింపబడిన ఇద్దరును ప్రభువు చెప్పిన వాక్యము చెంతకు చేరగలరు. ఇతడు చేరడు వారు చేరువారు గనుక వారి విషయములో ఎన్ని ఆటంకములు వచ్చిన, ఎన్ని ప్రశ్నలు పుట్టిన ఎంత బలహీనత

గలిగిన దేవుడు రక్షించగలడు. అసాధ్యమని అనుకొనేవారినికూడ రక్షించగలడు. అసాధ్యము సాధ్యమే అను ఈ వాక్యముయొక్క మొదట మనుష్యుడు, చివర దేవుడు. ఈ వరుసనుగూర్చియే ప్రభువుచెప్పెను. దేవునిగురించి ఆలోచనచేస్తే రక్షణ సాధ్యము! ఇది మనుష్యుల సాధ్యమే. ఈ వాక్యముయొక్క మొదట చివర, మధ్య అంతట మనిషే ఉండి దేవుని విషయమును ఆయన ప్రయత్న విషయమును ఏమిలేకుండా లేనివానికి ఈ వాక్యమేగాని పైవాక్యము సంబంధింపదు.

షరా:- దేవుడు తన వాక్యముద్వారా బయలుపరచిన సంగతినిదాటి వెళ్ళినయెడల పండుతిన్న అవ్వ పతనము లభించును. అందని పండ్లకు అఱ్రులు చాపనేల? దేవుడు మనకు శరీరసౌఖ్యము ఆత్మీయ వరములు, జ్ఞానము, శక్తి, సంపద, తాత్కాలిక సహాయములు అనుగ్రహించకపోయిన రక్షణయిస్తే ఇది అంతేచాలు. ఇట్లు మనిషి సంతుష్టిపడిన మేలు, ప్రభువు ఇస్తే ఇది అది సంతోషమే అని ఒకరన్నారు మోక్షములో అంతస్తులున్నవట అని ఎవరు గడించగలరు మోక్షములో ఎక్కడో ఒక్కచోట ప్రవేశించేభాగ్యము దొరికితే అంతేచాలు.

షరా:- ఈయన కృపజీవికాడు, సుకుమారి కష్టజీవికాడు, సుకుమారి, ఈ దినములలో ప్రభువ సంఘవర్తమానములు విన్నవారు పైఅంతస్తే కోరుకొనుచున్నారు కష్టాలపాలైతేనేగాని ఆ అంతస్తు ఎట్లు వచ్చును.

# 11.

## “నా నామమున మీరు నన్నేమి అడిగినను నేను చేతును” అని రక్షకుడు చెప్పెను. యోహాను 14:14.

ఇది ఇదివరకు వివరించినది? గనుక క్లుప్తపరచబడినది. బైబిలులో వ్రాయబడిన వాగ్దానములన్నియు దీనిలో ఇమిడియున్నవి. ఈ మాట ప్రభువు తన శిష్యులకు చెప్పినమాట? అన్ని కాలముల శిష్యులకును అన్వయించును. నా నామము అనగానేమి? ప్రతి విశ్వాసి

ప్రార్ధనాంతమందు యేసుప్రభునిబట్టి ఆలకించుము అని చెప్పుటవలన ప్రార్ధనలు నెరవేరును. నామమనగానే ఆటంకములు విడిపోవును. ఎంతమంది నా నామమును ఎత్తినను ఆటంకపరులైన దురాత్మలకు భయములేదు. యేసునామమనగానే వాటికి భయము. ఆటంకములు పిశాచివలననే వచ్చును. యేసునామము ఎత్తగానే పిశాచి పారిపోవుట వలన ఆటంకముకూడ పోవును. యేసునామము ఉచ్చరింపగానే పాపియొద్దనుండి పిశాచి పారిపోవునప్పుడు పాపముకూడ పారిపోవును. యేసునామము ఉచ్చరింపగా దయ్యము పారిపోవునపుడు వ్యాధికూడ పారిపోవును. అట్లే అన్ని చిక్కులలోను స్మరించి గ్రహించుకొనవచ్చును. ఒకప్పుడు చెప్పినట్లు ఇంటి యజమాని పేరు వినగానే దొంగపారిపోవును. యేసునామము పామరుల ఉపయోగనిమిత్తము ఇవ్వబడిన నామములలో ముఖ్య శ్రేష్టనామము యేసు నామము పేరెత్తగానే యేసుప్రభువు వచ్చును. ఆయనరాగానే పిశాచిపారిపోవును. అతడు పారిపోగానే చిక్కులన్నియు పారిపోవును. హిందువులు దైవనామస్మరణ వలన సమస్తమైన ఇక్కట్టులు అంతర్ధానమగునని నమ్ముదురును. అదిమాత్రమేకాదు దైవభక్తుల నామస్మరణ చేసినయెడల కూడ చిక్కులు మొదలైనవి పోవునని నమ్ముదురు.

చేతుననగా నేమి? వాగ్ధానముయొక్క నెరవేర్పు నిశ్చయత ఈ క్రియలో కనబడును. ఈ వాక్యముకూడ ఒక వాగ్ధానమే మనకు ఏది కావలసిన అడుగవలసినది. ఈ వాక్యములో కనబడుచున్నది. అడుగుట, బ్రతిమలాడుట, మొర్రపెట్టుట, ప్రార్థించుట. ఈ మొదలైన మాటలన్నియు అడుగుట అను అంశమునకే సంబంధించును. మాటల బేధమేగాని భావము ఒకటైతే మాటలవాడుక చనువునుబట్టి ఉంటున్నది. నెరవేర్పుకలిగే వాటము లేనప్పుడు మొరబెట్టుదుము. నెరవేర్పు ఆలస్యమగుచున్నపుడు మునునివలె బ్రతిమలాడుదుము.

ప్రార్థించుట అన్నిటికి సంబంధించినది, ఒకటి అడుగుట మిగిలిపోయినది, అడుగుటయేమిటి ఎవరు చెప్పగలరు. ఎంతో పరిచయము ఉంటేనేగాని ఇది కుదరదు. మొరబెట్టితేనేగాని, విసగకుండా ప్రార్థిస్తేనేగాని నెరవేరదుగదా అడిగితే నెరవేరుతుందా? అని అందురు అందులోనే రహస్యమున్నది. ఏమి అవసరములేకుండా, ఏమియు తిప్పలు పడకుండా అడగడము తీసికోవడము ఇది ఎంతటివారికి లభించును. అడగండి మీకీయబడుననే వాక్యమిక్కడ జ్ఞాపకమునకు వచ్చును. పై వాక్యమంతటిలో ఏమనేది మహా ముఖ్యమైనది వానిలో నరులకు కావలసినవన్నియు ఉన్నవి. ఇది అది అనే వివరములేదు ఎటువంటి నిరాశపరులనైన ఇది ప్రేరేపించును. సంతోషపరచును. ఇది అడుగవచ్చు. అది అడుగవచ్చునని ప్రభువు చెప్పలేదు. ఏదైన అడుగవచ్చును అనగా మిక్కిలి సుళువైనది మిక్కిలి కష్టమైనది. అసాధ్యమైనది అడుగవచ్చును. తండ్రికిని, బిడ్డకునుగల సంబంధము ఇట్లు అడిగించగలదు. ఉండి ఉండి ప్రభువు ఎంత అద్భుతకరమైన ఎంత విశాలమైన, ఎంత దాతృత్వముగల వాగ్దానమిచ్చినాడో చూడండి. ఒక విశ్వాసి నేను బ్రతిమాలను, మొరబెట్టను, ప్రార్థించనుకాని అడిగెదను ఇస్తాడా? ఇవ్వడా? అన్ని అనుకొను జవాబిందులో ఉన్నది. "అడుగుటనే" గొప్ప పని మీరు చేయగలిగితే చేయుటనే గొప్ప పని ప్రభువు నెరవేర్చలేడా? అడుగకముందు పరిచయమును విశ్వాసమును. పుచ్చుకొనే స్వభావమును సంపాదించుకొనవలెను. ఆ తర్వాత ఎన్ని అడిగినా ఫరవాలేదు. బైబిలు విద్యార్థులు ఈ వాక్యమును మొదటి పుటమీద వ్రాసికొనుట మంచిది. ఇది సన్నిధి గదికి తగిన మూలవాక్యము ఒక విశ్వాసి ఇట్లనుచున్నాడని అనుకోండి ఓ ప్రభువా! సన్నిధి గదిలోనికి వచ్చినాను, చాలసేపు ప్రార్థించుటకు సమయము లేదు గనుక అడుగవలసినవి ఒక ముక్క అడిగి వెళ్ళిపోతాను ఎవరికొరకు ఇస్తావు ఎందుకు వాగ్ధానము చేసినావు అనంటే తప్పుండవు. ఆ చనువునుబట్టి ఉండును.

# 12.

## మనము అడుగువాటన్నిటికంటెను, ఊహించువాటన్నిటికంటెను అత్యధికముగా చేయశక్తిగల దేవునికి...ఎఫెసీ 3:20.

1) రెండు సంగతులు గుర్తించవలెను. మొదటిది అడుగునవి, 2) ఊహించునవి అడగండి అని ప్రభువు మనకు చెప్పినయెడల ఏమైనను అడుగుదుము. అడుగుటకంతముండదు అన్నియు నరునికి కావలసియున్నవి. ఎన్ని అడిగినను ఇస్తానని మాత్రముకాక ఇవ్వగలడనికూడ ఈ వాక్యములో యున్నది. ఇష్టమున్న ఆయన అన్నియు ఇచ్చుట నాకిష్టమే అని పలికి అన్నియు ఇవ్వలేనని చెప్పునా? ఇవ్వకపోతే ఆయనకు ఇష్టమైతే ఉన్నదిగాని శక్తి లేదనుకొందుము. అయితే ఇక్కడ ఇచ్చేవాడు నరుడుకాడు. పుచ్చుకొనేవాడు నరుడే. ఇచ్చేవాడు దేవుడు గనుక ఇచ్చుటకు ఇష్టమును, శక్తినిగలదని ఉన్నది అడుగుటనుగూర్చి ఇదివరకున్న వివరములలోగలదు. మరియొక విషయము మాకు ఫలానిది కావలెనని అడుగకపోవచ్చును. గాని కావలసినవి మనస్సులో ఉండవచ్చును. ఊహలోనున్నదికూడ ఇవ్వబడునని ఈ వాక్యములో ఉదహరింపబడినది. విశ్వాసికి ఈ వాక్యములో ఉదహరింపబడినది. విశ్వాసికి ఈ గొప్ప విషయము ఆశ్రయాస్పదమైయున్నది అనగా నేను అడుగుటలేదు, ప్రార్థింపలేదు బ్రతిమాలలేదు నాకు అడిగిపెట్టండని ఎవరిని కోరలేదు, గాని నా మనస్సులో నున్నది దేవునికి తెలుసును గనుక నెరవేర్చినాడని విశ్వాసి సంతోషించును. ఈ ఊహకు అడిగే రూపము రాకముందే అది ప్రార్థనలోనికి తేకముందే నెరవేర్పు కలుగును అని యనుట విశ్వాసికి ఎంతో సంతోషము. ఊహించేది మాత్రమేకాదు, ఊహించేదానికంటే ఎక్కువ ఆయన ఇవ్వగలడు. "కంటే, ఎక్కువ అను ఈ రెండు మాటలనుబట్టి విశ్వాసి తన స్థితిని అనగా దుస్థితిని పనియొక్క స్థితిని పరీక్షించి యెంత సిగ్గుపడవలసివచ్చును. మన విషయము

ఆలోచించవలసిన దేమనగా ఏమడుగవలెనో, ఎంత అడుగవలెనో తెలియదు గనుక మనకు కావలసినవన్నియు అడిగిన వెనుక ఇకలేవని అనుకొందుము. ఇంకా మనకు ఏమి అవసరమో ప్రభువునకు తెలుసును. మనమైతే అక్కరకురానివి అడిగితే ఏమనుకొనునోనని సంశయింతుము. ఈ వాక్యములో అన్ని సంశశయములు తీరుచున్నవి. దేవా! నాకు కావలసినవి జ్ఞాపకము వచ్చినవి యడిగినాను. అడుగవలసినవి యున్నయెడల అవికూడ అడుగకపోయినను, ఇమ్ము, నాకు దయచేసిన స్వాతంత్ర్యము నిమిత్తమై నీకు వందనములని ప్రార్థించుట మంచిది. ప్రతి ప్రార్థన యొక్క ముగింపులో ఈ తలంపుగల వాక్యముండుట మంచిది. ఎఫెసీ పత్రిక పరలోక పెండ్లికుమార్తెను జ్ఞాపకము చేసే పత్రికయై యున్నది. ఈ పత్రికారంభమందు అనాదికాలము కనబడుచున్నది. అప్పుడే క్రీస్తుయేసులో మనలను దేవుడేర్పర్చుకొన్నట్లు వివరింపబడినది. అన్ని ఆశీర్వాదములు ఇచ్చివేసిన ధ్వని వినబడుచున్నది. మనలను తనయొద్ద కూర్చుండబెట్టిన సంగతి జ్ఞాపకము వచ్చినది ఏర్పర్చుకొనుటయు, దీవించుటయు కూర్చుండబెట్టుకొనుటయు ఇవి భావికాల విషయములుకావు. గతకాల విషయములే గనుక ఆ ఏర్పాటు ఆధారము చేసుకొని మన మనవులు సిద్ధపరచుకొనవలెను. ఇదివరలో చెప్పబడినట్లు అంత గొప్ప స్వాతంత్ర్య విశ్వాసముకలిగి యుండుట సుళువుకాదు. ఎందుచేత, మనలోని బలహీనతలన్నియు విసర్జించి ప్రభువు ఈ వాక్యములో ఇచ్చిన చనువును జ్ఞాపకముచేసికొని అడిగిన యెడల సంపదగలవారమగుదుము. ఈ వాక్యములో బహువచనము వాడబడియున్నది. మనలో మనము ఈ రెండు బహువచనములే గనుక వీటిలో సంఘముగలదని తెలియుచున్నది. సంఘమంతయు కలిసి అడిగితే దేవుడు ఇవ్వనని చెప్పడు. దేవునికి పరలోకములో తనయొద్ద నిత్యము కావలసినది సంఘమేకాని ఒక్కడేకాదు. ప్రస్తుతము మనకు ఎరిగినంతమట్టుకు సంఘమంతయు ఇటువంటి ప్రార్థన

చేయుట దుర్లభము. ఎందుకనగా ఇంకను ఏకసంఘముగా మిషను శాఖలన్నియు విశ్వాసులందరు క్రీస్తు నామధారులందరు ఏర్పడలేదు. జాగ్రత్తగా కనిపెట్టిన యెడల కారణములు కనబడుచున్నవి. ఏకత్వములేదు, అందరికి వాక్య విషయములో ఒకే అర్ధములేదు. విశ్వాస విషయములోకూడ బేధములున్నవి. పత్రికలలో వ్రాయబడినట్లు అనగా సంఘమును క్రీస్తు సంపూర్ణముగా ప్రేమించునట్లు సంఘము క్రీస్తును ప్రేమించుటలేదు. గాని అన్ని మిషనులవారు ఏకత్వమునే కోరుచున్నట్లు ప్రయత్నములు కనబడుచున్నవి గాని నెరవేరుటలేదు. కాబట్టి సంఘము యావత్తు పైకి చేతులెత్తి దేవునిని వేడుకొనుటకు వీలులేదు.

**దేవునికి మహిమ:-** అనగా దేవునికి కీర్తి కలుగును, ఈ మాట క్రిస్మస్ పాటలో కలదు. దూతపాటలో దేవునికి మహిమ అని ఉన్నది. క్రీస్తుప్రభువు భూలోకమునకు వచ్చిన వ్యక్తి. దేవుడు పరలోకములో యున్న వ్యక్తి. మానవులను రక్షించుటకు పరలోకమునుండి క్రీస్తుప్రభువు వచ్చెను. సంఘము ఏమంచి కార్యముచేసిన అది క్రీస్తునుబట్టియే యుండును. క్రీస్తుప్రభువు ఏమియు చేయనియెడల సంఘము ఏమియుచేయలేదు "మూలముగా" అనుమాట గుర్తించండి సంఘము నిమిత్తము ప్రభువు చేసినపని యావత్తును ఇక్కడ జ్ఞాపకమునకు వచ్చుచున్నది. సంఘమును, యేసుప్రభువును ఏకమై యున్నప్పుడు ఈ వాక్యము సరిపోవును. సంఘము విడిపోవునపుడు మహిమ రాదు. సంఘము సంఘములోనుండి విడిపోవుట ఒకటి. సంఘము క్రీస్తులోనుండి విడిపోవుట ఇంకొకటి ఈ రెండింటిలో దేనివల్లను దేవునికి మహిమరాదు. మరియు తరతరములు అనుమాటయు, సదాకాలము అనుమాటయు గుర్తింపవలసినది, తరతరము అనగా మానవులు భూమిమీద జీవించునంతకాలము, సదాకాలమనగా జీవాంతము తరువాత వచ్చునట్టి కాలము రక్షితులైన సంఘస్తులు భూమిమీద

మాత్రమే గాక పరలోకమునందును నిత్యము జీవించుచుందురు. వారు నిత్యము దేవునిని మహిమపరచుచునేయుందురు. మనలో కార్యసాధకమైన తన శక్తిచొప్పున నేటివరకు మనలో పనిచేయుచున్న తన శక్తినిబట్టియని యర్థము. దేవునిశక్తి మనలో పనిచేయును, గాని మనము చేయనిచ్చునంత మాత్రమే చేయును. అత్యధికముగా అనగా నేను? ఎంత ఎక్కువగా అనగా కావలసినంతకంటే ఎక్కువగా అనుగ్రహించును అనగా కొదువలేకుండా చేయును.

# 13.

**సమస్తమును మీవి. కొరింథి 3:21 సమస్తము అనగా మీకు తెలిసినవి. కావలసినవి, వాగ్దానములోనున్నవి. ఈ లోకములో ఆ లోకములోను సిద్ధపరచినవి ఏవో అవి మనవి.**

# 14.

# సన్నిధి చార్టు

**1వ మాట వివరము:-** నాయొద్దకు వచ్చువానిని నేనెంత మాత్రమున బయటికి త్రోసివేయను.

నేను సిద్ధపడలేను, ప్రార్థనరాదు హృదయము నిండా కళంకమేదైనను దీనినిబట్టి సన్నిధిలోనికి వచ్చి "ఉన్నపాటున అనుకీర్తన" వచ్చుచున్నాను అని వెళ్ళవలెను.

**2వ మాట:-** అడుగుడి మీకు ఇయ్యబడును. దీనినిబట్టి నాకు కావలసినవన్ని అడిగెదను. ఇచ్చినసరే యివ్వకపోయినను సరే ఇస్తానని యున్నది గనుక ధైర్యముగా అడిగెదను.

"ప్రార్థన చేయునప్పుడు-నమ్ముడి"

**3వ మాట:-** ఇది కష్టమైనప్పటికి బాహ్యదృష్టికి కనబడక పోయినప్పటికిని కనబడినట్లు తృప్తిపరచుకొనుడి. రహస్యమందు చూచు నీతండ్రి నీకు ప్రతిఫలమిచ్చును.

**4వ మాట:–** నీకు ప్రార్ధనచేయు గదిలో నా జతకు ఎవ్వరు అక్కరలేదు నా గదిలో నా తండ్రి, నేనుయుందును. నాకు వచ్చినట్లు ప్రార్ధిస్తాను. బలము కలుగును, తప్పకుండ కలుగును తండ్రి దగ్గరనుండి బహుమతి పొందకపోను.

దివారాత్రములు మొఱ్ఱబెట్టుట.

**5వ మాట:–** ఒక వాక్యమునుబట్టి వచ్చివేస్తివి గనుక నేను ఏర్పాటు మనిషినే కాబట్టి (వినడా చార్టు) తన కుమారునిబట్టి అడిగినది ఇచ్చును.

**6వ మాట:–** నేను అడిగినది ఎక్కువైనది గొప్పదైనది అయినను కుమారుడు గనుక ఆయనకంటే ఇవి తక్కువే గనుక ఆయనను ఇచ్చివేసినట్లు అన్ని ఇచ్చును.

**7వ మాట:–** నేను ప్రార్థించలేకపోయినా నా కొరకు ఎవరు ప్రార్థించలేకపోయినను నిరాశపడను వారికంటే నాకంటే ప్రార్థించే వారు నాలోనెయున్నారుగా మరి.

**8వ మాట:–** సన్నిధిలోనికివెళ్ళితే మేలే అనియు, కావలసినవి వాటంతట అవే సమకూడునని యున్నది గనుక చింతపడును.

**9వ మాట:–** ఈ వేళ నేను ఉద్దేశించి అడిగేవి ఆవేళ తండ్రి ఉద్దేశించినదే లేకపోతే ఈవేళ నేను ఎందుకు వత్తును.

**10వ మాట:–** "నేను యెహోవాను సర్వశరీరులకు దేవుడను." సర్వశరీరులనే మాటలో నేనున్నాను. నాకుకూడ శరీరమున్నది అసాధ్యమైతే నాకెందుకు, సాధ్యమైతే నాకెందుకు సాధ్యపరచే ఆయన నాకుండగా నాకు అడ్డుయేమి?

**11వ మాట:–** అలాగైతే ఎవరు రక్షణ పొందగలరు. మనిషి ఏదైనా సంపాదించగలడు. ఆకాశములోనివి. భూమిమీదివి కూడ రక్షణ మోక్షములోనున్నది. గనుక సంపాదించలేడు. దేవునికి అసాధ్యముకాదు. గనుక నమ్మి అందుకొనవలెను.

## నా నామమునుబట్టి నన్నేమి

**12వ మాట:-** ఏమి అనుమాట భూమిమీదనుండి ఆకాశమువరకును, ఆకాశమునుండి మోక్షమువరకును వ్రాయవచ్చును, అడుగవచ్చును. అడుగకూడదు అనిలేదు ఇది ఎంత గొప్ప ఆదరణగల వాక్యము.

**13వ మాట:-** "అడుగువాటన్నిటికంటే ఊహించువాటన్నికంటే మనము అడిగేవి ఎక్కువ ఊహించేవి అంతకంటే ఎక్కువ ఇచ్చేవి మరీ ఎక్కువ ఎందుకు ఇవ్వడు.

**14వ మాట:-** "సమస్తమును" అడుగకముందే సమస్తమును మీవే అని వ్రాయబడియున్నది. గనుక అక్కడివి తీసికొనిన అనుభవించుట నాపని. సర్వశరీరులుయని ఉన్నది. సమస్తమును ఇన్ని కలిసి ఎన్నైనను పుచ్చుకొనగలను.

**15వ మాట:-** "దేనినిగూర్చి చింతింపకుడి" కృతజ్ఞతతో నా హృదయమును నింపుకొంటే దానములతో నా చేతులు నిండును. సామానులతో నా యిల్లు నిండును. వర్తమానములతో నా నోరు నిండును. అన్నిటికంటే ముఖ్యముగా పరిశుద్ధాత్మతో నా హృదయము నిండును. దేవుని వాక్యనిబంధనలు ఎంత పని చేస్తూయున్నవి? నన్ను గురించి నాతండ్రి చింతించుచున్నాడు గనుక నాకు చింతయుండకూడదు. నీ తండ్రి గార్ధబలములను గూర్చి చింతించుటలేదు. నన్నుగూర్చి చింతించుచున్నాడు. సమస్తము మీవి. 1కొరింథి 3:21.

16. మనము ఎంత భాగ్యవంతులము మనము సన్నిధి గదిలోనికి వెళ్ళనైయున్నపుడు వెళ్ళకముందు రెండు వాక్యములు మనము చూడవలెనని జ్ఞాపకము చేయుచున్నాను. 1) త్రోసివేయను, 2) సమస్తమును మీవి. ఈ రెండు వాక్యములను చదివి ప్రార్థనాపరులు ఆనందించవలయును. ఈ రెండు వాక్యములు చదివి ప్రార్థనాపరులు

మధ్యను మోకరించి అన్ని ప్రార్ధనలు చేయవలెను మీరు ఏవి తలంచుకొంటే అవి మీవే.

దేనిని గురించియు చింతింపకుడిగాని ప్రతి విషయములోను, ప్రార్ధన విజ్ఞాపనములచేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి. ఫిలిప్పీ 4:6.

# 15.

## సంగ్రహ వివరము

1. ఈ చార్టు ముగింపు సన్నిధి చార్టులో ఉదహరింపబడిన బైబిలు వాక్యములును, వాటియొక్క వివరములును కలిసి ఒక గొప్ప బోధగా ఏర్పడినది. ఇది బోధ పత్రిక. ఇది వ్రాసినప్పుడు విన్నప్పుడు మీమనస్సు ఎట్లుండునో గుర్తించండి.

2. మీరు ఒక రోజున ఈ చార్టులోనిదంతయు బాగుగా మనస్సు ఇచ్చి చదువుకొని వెంటనే సన్నిధిగదిలోనికి వెళ్ళి యేదో ఒక అంశముమీద, మిక్కిలి అసాధ్యమైన సంగతినిగూర్చి ప్రార్ధించేటప్పుడు మీ మనస్సు ఎట్లుండునో గుర్తించండి (లూకా 6:5).

3. సన్నిధి గదిలోనుండి బయటికి వచ్చిన తరువాత మీ ప్రార్ధన నెరవేర్పు ఎట్లుండునో గుర్తించండి. అప్పుడు దేవునివాక్యము ఎంత సత్యమైనదో అనుభవరీతిగా తెలుసుకొనగలరు. దేవునిని మహిమపరుపగలరు.

4. ఇదంతయు ఎవరికైనా బోధించేటప్పుడు మీ మనస్సు వారి మనస్సు ఎట్లుండునో గుర్తించండి.

షరా:- నీవు పైవాక్యములన్ని జ్ఞాపకము చేసికొనుచు మహా ధైర్యముతో ఒక కఠినాత్ముని గురించి ప్రార్ధించేటందుకు వెళ్ళేటప్పుడు ప్రార్ధన గదికి వెళ్ళే మధ్యస్థలమున అనేక ప్రశ్నలు మిడుతల దండువలె రయుగమ్మును. ఆ ప్రశ్నలేవనగా ఇతడు చాలాకాలమునుండి

కఠినాత్ముడు. మారునా? దేవుడు మార్చగల్గునా? మార్చగలిగితే సౌలు, ఇస్కరియోతు యూదా, కయీనులను మార్చగల్గెనా? నా ప్రార్ధన, నా విశ్వాసము సరిపోవునా? ఒకరు ఒకరిని గురించి ప్రార్ధించిన తరువాత అతడు మరింత చెడిపోయినాడట. కొంతమంది విశ్వాసులు తన్ను గురించి ప్రార్ధించుచున్నారని విని ఒకరు మరింత చెలరేగినాడట చెలరేగి చెలరేగి అతడు రాత్రి మంచముమీద పరుండి నేను ఏమంత చెడ్డవాడనని ప్రార్ధనలు పెట్టుకున్నారు? ఫలాన ఫలానా వారికంటే చెడ్డవాడనా అని అనుకుంటే చెంతనున్నవారు విని, ఇతడు ఇంకేమి మారును. మరియొక సంగతి. మరియొకరిని గురించి ప్రార్ధన పెట్టుకొని మరుసటి దినమున వారియొద్దకు వెళ్ళి సన్నిధిచార్టు వినిపించి అయ్యో! మీకొరకు నిన్న ప్రార్ధించినాము అనిచెప్పి ఇదంత చదివి వినిపించలేక ఒక కాగితము చేతికిచ్చి మీరే ప్రార్ధించుకొనండనిచెప్పితే ఇంకేమి ప్రార్ధన చేస్తాడు? ఇట్టి ప్రశ్నలు మనస్సులోనికిరాగా సన్నిధికి వెళ్ళుట ఆగిపోవునా లేదా ప్రార్ధనవాలు ఆగిపోవును గనుక జాగ్రత్త నుండుడి.

**షరా:- సన్నిధి గదిలోనుండి బయటకు వచ్చేటప్పుడు**

1సమూ. 1:17 జ్ఞాపకము చేసికొనుము అదేదనగా 1) నీవు క్షేమముగా వెళ్ళుము ఇశ్రాయేలు దేవునితో నీవుచేసికొన్న మనవిని ఆయన దయచేయును. అపో॥కార్య॥ 10:4. నీ ప్రార్ధనలు దేవుని సన్నిధికి జ్ఞాపకార్ధముగా చేరినవి. ఇదికూడా బైటకు వచ్చేటప్పుడు జ్ఞాపకము తెచ్చుకొనండి.

షరా:- జవాబులేని నెరవేర్పులుకూడ బైబిలులో ఉన్నవి. 1) లోతును రక్షిస్తానని అబ్రాహాముతో దేవుడు పలకలేదు గాని నెరవేర్పు కలిగినది (ఆది 18:19). 2) ఏలియాకు వర్షము వచ్చునని తండ్రి చెప్పలేదుగాని నెరవేర్పు మేఘము చెప్పినదట.

3) యెరూషలేము సంఘముయొక్క ప్రార్థన సమయమున పేతురును విడిపిస్తానని పలుకలేదుగాని పేతురు తలుపుకొట్టుట ద్వారా నెరవేర్పు (అపో॥కార్య॥ 12:15).

## 16.

### విసుగక నిత్యము ప్రార్థనచేయుడి. లూకా 18:1.

మానవుని జీవితములో విసుగుదల రాకమానదు. ఎంత గొప్పవాడైనను ఎంత సహనశాలియైనను ఎంత దైవభక్తిగల వాడైనను కష్టములు వచ్చినపుడు విసుగుదల రాకమానదు. బైబిలు చదువునప్పుడు, వర్షము కురియునప్పుడు, ఎండ విస్తారముగా కాయునప్పుడు విసుగుకొనుచున్నాము.

**దైవ ప్రార్థన 2వ భాగములు:-** 1. విసుగక ప్రార్థనచేయుట 2. నిత్యము ప్రార్థనచేయుట విసుగుదల ఎప్పుడు కలుగును 1) సమయము దొరకనప్పుడు 2) స్థలము దొరకనప్పుడు, వీలులేనప్పుడు విసుగుదల కలుగును. విసుగుకొనినప్పుడు అది దైవప్రార్థన అనబడదు. ఎందుకనగా ప్రార్థనలో విసుగుదల అనేయి యున్నది, ముఖ్యముగా చెప్పవలెనన్న ఇది ప్రార్థనకాని ప్రార్థన, బేబిలులో ఒక స్త్రీయున్న. ఆమె అధికారియొద్దకు వెళ్ళినది. అనేకసార్లు వెళ్ళినది. గాని జవాబు దొరకలేదు. అయినను విసుగల అధికారియొద్దకువెళ్ళి అడుగుచున్నది. దీనినిబట్టి చూస్తే ఆమె విసుగుకొనవలసినది. విసుగుకొనుటకు కారణమున్నది. అటువంటి సమయములోకూడ ఆమె విసుగుకొనలేదు. అధికారి ఆమె మనవి పరిష్కరించవలసినదేగాని త్వరగా పరిష్కరించలేదు. అయినను ఆమె విసుగుకొనలేదు. అలాగే మనము ప్రార్థించినప్పుడు త్వరగా జవాబు ఇవ్వలేకపోతే విసుగుకొనరాదు. ఒక విషయమునుగూర్చి మనము ప్రార్థించినప్పుడు దానినిగూర్చి త్వరగా జవాబురానియెడల విసుగుకొందుము. దేవుడు నా మనవి ఆలకించలేదని. మనము

విసుగుకొనరాదు. ప్రార్థనచేయుట మానరాదు. మనకు ఒక న్యాయమున్నది:- ఎల్లప్పుడు ప్రార్థనచేయవలెను. దేవుడు మన ప్రార్థనవిని జవాబిచ్చును. మనము ప్రార్థనచేసేటప్పుడు విసుగుదల ఉన్నయెడల మనము ప్రార్థనచేసే న్యాయముపోయినది. గనుక తండ్రి న్యాయ నెరవేర్పు జవాబు దొరకదు. మనము న్యాయప్రకారము నెరవేర్చితే ఆయన నెరవేర్పవలసిన న్యాయము నెరవేర్చును. ఈ ఉపమానములో చూపింపబడియున్నది. న్యాయాధికారి స్త్రీయొక్క మనవి ఆలకించి న్యాయము జరిగించునట్లు మనకును న్యాయము దొరుకును.

**ఎందుచేత విసుగుకొనకూడదు:-** కొంచెము ఆలస్యమైనను దేవుడు మనమాట ఆలకించును. గాన మనము విసుగుకొనకూడదు. దేవునియొద్దనుండి రావలసిన జవాబు రాలేదని, నెరవేర్పు లేక రాలేదని విసుగుకొనుచున్నాము వీటివైపు మనము చూడకూడదు.

**విసుగుకొనకుండుటకు కారణము:-** తప్పక న్యాయము తీర్చును, జవాబు ఇచ్చును. పై కారణము చూడక కారణము చూడవలెను.

**విసుగుదల చేసే కీడు:-** 1) నిత్యప్రార్థన యుండుట 2) ప్రార్థన ఆగిపోతుంది. గోజాడి ప్రార్థనచేస్తిని, ఇంక ఎందుకులే అను తలంపువచ్చును. నెరవేర్పులేదని విసుగుకొనవద్దు, ఎప్పటికైనా నెరవేర్పు వచ్చునని ఆ ప్రార్థన సాగించండి. విసుగుదల కొట్టివేసి నిత్యప్రార్థనలోకి ప్రవేశించండి. విసుగుదలవల్ల ప్రార్థన ఆగిపోవును 4రోజులు ప్రార్థనచేసి ఊరుకొంటే ప్రార్థనకాలేదు, ప్రార్థన నవరూపము ధరించలేదు గాని విసుగుదల భరించినది. 1. స్త్రీయెదట అనుభవములో ఒక వృత్తాంతము కనబడుచున్నది. ఆలకించలేదు. 2. స్త్రీ మనస్సులో తప్పక ఆలకించును అను వృత్తాంతమున్నది. మొదటి వృత్తాంతమును రెండవ వృత్తాంతమునకు వ్యతిరేకముగా కనబడుచున్నది. అయితే మానవుని హృదయములోనుండవలసినది

ఇప్పటికైతే ఆలకించనప్పటికిని ఎప్పటికైనా ఆలకించును 1) విశ్వాసి రెండవది పట్టుకొనును ఆలకించలేదు. ఇందుచేత నిరాశలోనికి వెళ్ళిపోవును. ఇది నిత్య ప్రార్ధనకాదు. విశ్వాసి ఈ మూడును గుర్తించవలెను. (1) నా ప్రార్ధన జరుగుతుందా లేదా! విసుగుదల లేకుండ (2) ఆలకించలేదనునట్టిది లేకుండా ప్రార్ధన సాగించుట (3) తప్పక నా ప్రార్ధన తండ్రి ఆలకించును అను నమ్మకము. అప్పుడిది నిత్య ప్రార్ధన అగును. దివారాత్రులు ప్రార్ధన చేయవలెను. దివారాత్రులు అనగా నిత్య ప్రార్ధనను జ్ఞాపకము చేయుచున్నది. తాను ఏర్పర్చుకొన్నవారి యొక్క ప్రార్ధన. ఎవరైతే విసుగుదల లేకుండా ప్రార్ధన చేయుదురో వారిని ప్రార్ధన పరులను ఆయన ఏర్పరచుకొన్నాడు. ప్రభువు మాట, తాను ఏర్పర్చుకొన్నవారి మాట లేక ప్రార్ధన. ఆయన వినుచున్నాడు. ఏ పనిమీద ప్రార్ధనా పరులను ఏర్పర్చుకొనుచున్నాడు? ప్రార్ధన నెరవేర్పు పనిమీద ఏర్పాటు చేసికొంటున్నాడు. దేవునికి ప్రార్ధనలు నెరవేరుట కావలయును.

ఒక ప్రార్ధన అంశము మనము చేస్తే దేవుని కోరిక ఆ ప్రార్ధన అంశమును నెరవేర్చవలయును. ప్రార్ధనచేయు అంశమును నెరవేర్పు ఆయనకు కావలయును. గాన నెరవేర్చుటకు దేవునికి మనుష్యులు కావలయును ఎట్టివారు? 1) విసుగక ప్రార్ధన చేయువారు 2) నిత్యము ప్రార్ధనచేయువారు. బోధచేయుటకు కొందరు బోధకులు కావలయును, రోగులను ఆదరించుటకు ఆదరణకర్తలు కావలయును. చిక్కులతో నున్నవారిని విడదీయుటకు పరిచారకులు కావలయును. ప్రార్ధన నెరవేర్పు కొరకు ప్రార్ధనపరులు కావలయును. ఈ ప్రకారము నెరవేర్చుకొన్నారు. సిద్ధపడినారు గాన ఆయా పనులకు పంపును. దేవునికేమి కావలయును నెరవేర్పులు కావలయును. నెరవేర్పులు తెచ్చు ప్రార్ధనలు కావలయును. అట్టి ప్రార్ధనలు చేయు ప్రార్ధనా పరులు కావలయును. క్రీస్తుప్రభువుయొక్క శిష్యులు:- వీరు బాగుగా నేరుకొన్నారు, విన్నారు, సిద్ధపడినారు, నూతన బలము

పొందియున్నారు. గనుక ఇతరులకు బాగుగా చెప్పగలరు. క్రీస్తు ప్రభువు దగ్గర బాగుగా నేర్చుకొని సిద్ధపడినారు గనుక లోకమునకు సందేశములను అందించిరి. సన్నిధిలో బాగుగా తయారైరి శిష్యులు నెరవేర్చుకొన్నప్పుడు విసుగుకొన్నారుగాని సేవలో నున్నప్పుడు విసుగుకొనలేదు. మనము కూడ ఈ రెండు అనుభవములును అవలంభించినట్లయితే మనలనుకూడ ఆయన గొప్పగొప్ప పనులకు ఉపయోగించును. దేవుడు నన్ను ఏర్పరచుకొనవలయునని కోరుకొనండి ప్రభువు సెలిచ్చిన ప్రకారముచేస్తే ప్రభువు ఏర్పాటుచేసికొన్న వారిలో చేరగలము. ఈ దినములో ప్రార్ధన తగ్గిపోవుచున్నది. కష్టములవలన ఏమి ప్రార్ధన అని అనిపించును. సొమ్మసిల్లిపోవును.

**నిత్యము:-** నిత్యము ప్రార్ధనచేయుమని చెప్పెనుగాని త్వరగా ఆయన న్యాయము తీర్చును.

2. దివారాత్రులు, 3. త్వరగా నెరవేర్పు లేకపోతే విసుగుదలవల్ల తరచుగా అనేక ప్రార్ధనలు నెరవేర్చవలయును. గాన త్వరగానే నెరవేర్చును. త్వరగా ప్రార్ధనలు ఆలకిస్తానన్నది విశ్వాసము. ఆలకిస్తాడనునది రెండు విధములుగా చెప్పగలము. 1) వృత్తాంతము భావికాల వృత్తాంతము. స్త్రీయొక్క ప్రార్ధన ఆలకించేడు. భావికాల వృత్తాంతము తండ్రి ఆయన ఏర్పరచుకొనిన వారి ప్రార్ధన వినును. ప్రార్ధన అనునది ఊపిరి వంటిది. ఊపిరి శరీర జీవనమునకెట్టిదే ప్రార్ధన అనునది ఆత్మీయ జీవమునకు అట్టిదైయున్నది.

# 17.

# సన్నిధిపరులు చేయవలసిన స్తుతులు

1. మా సదుపాయము నిమిత్తమై సమస్తమును కలుగజేసిన తండ్రీ, మారక్షణ నిమిత్తమై శరీరధారిగా వచ్చి

ప్రాణ సమర్పణ చేసిన కుమారుడవైన తండ్రీ! మాకు కుమ్మరింపుగా అందిన పరిశుద్ధాత్ముడవైన తండ్రీ! త్రిత్వదేవుడవైన తండ్రీ నీకు నమస్కారములు.

నీవు మాకు బోధకుడుగాను, రక్షకుడుగాను, పోషకుడవుగాను, వైద్యుడవుగాను, సర్వాంశ సహాయకుడుగాను, మోక్షదాయకుడుగాను బైలుపడినందున నీకు అనేక వందనములు.

2. జ్ఞానముద్వారాను, సృష్టిద్వారాను, బైబిలుద్వారాను మాకు నిన్ను గురించి తెలియజేసికొన్నావు గనుక నీకు అనేక స్తోత్రములు.

3. నీ ప్రియకుమారునిలో మాకు కనబడినావు. గనుక నీకనేక స్తోత్రములు.

4. భూమిమీదనున్న సమస్తజనుల రక్షణార్ధమై సంఘమును పాఠశాల గృహముగా నిర్మించినావు గనుక నీకు అనేక స్తుతులు.

5. సంఘకాలముయొక్క ఈ కడవరి దినములలో అక్కడక్కడ దైవసన్నిధి కూటములు ఏర్పరచినావు. గనుక నీకనేక స్తుతులు.

6. నీవెంత పరిశుద్ధుడవైయున్నను అయోగ్యులమైన మానవులమగు మా కూటములకువచ్చి, దర్శనమందు కనబడి మాతో ముచ్చటించుచున్నావు గనుకను, మా ప్రశ్నలకు సంతుష్టికరమైన జవాబులు వినిపించుచున్నావు గనుక నీ పాదములకు అనేకమైన ముద్దులు.

7. తండ్రీ! సన్నిధి కూటముల విషయములు అందరకు తెలియునట్లు పత్రికలు మాచేత ప్రకటింపచేయుచున్నావు. గనుక నీకు అనేక స్తుతులు. సర్వలోకమునకు తండ్రివైన దేవా! నీవు మనుష్యులకు కనబడవనియు, వారితో మాటలాడవనియు లోకులు తలంచుచున్నారు. మా హృదయస్థితి సరిగా లేనందున దేవుడు కనబడడనియు, మాటలాడడనియు వారు తలంచుటలేదు. తండ్రీ మాకు దర్శనమిచ్చుచున్నావని మేము చెప్పినను కొందరు నమ్ముటలేదు.

నీవు అందరికి కనబడుదువని వారు నమ్ముటకు మేమే సాక్షులమైయుండునట్టి కృప దయచేసినందుకు నీకు అనంత స్తోత్రములు. యేసుప్రభువా! దర్శనమందు నాకు ప్రతి లక్ష్మివారము సంస్కా భోజనము వడ్డించుచున్నందుకు అనేక వందనార్పణములు. నీ రెండవ రాకడ విషయములను, సంస్కార భోజన విషయములను, మా ప్రశ్నలకు సంబంధించిన ఇతర విషయములను మేము వ్రాసుకొనగలిగినంత తేలికగా చెప్పుచున్నావు గనుక నీకు హృదయానంద ప్రణుతులు.

8. తండ్రీ! మా బైబిలు విషయములో లేచుచున్న అపార్ధములను ఖండన కార్యములను మాలో కొందరికి వచ్చుచున్న దుష్టస్వప్నములను తప్పుడు దర్శనములను ఆపుచేయుదువని నమ్ముచు నిన్ను స్తోత్రించుచున్నాము. నీయాజ్ఞ చొప్పున మేము బైబిలుమిషనును పైకెత్తి చూపించుచుండగా సైతానును, అతని దూతలును మామీదికి ఉగ్రలూగుచు చేయుచున్న దుష్ట ప్రయత్నములను నాశనము చేయుదువని నమ్ముచు నిన్ను స్తుతించుచున్నాము.

9. మా బైబిలుమిషను విషయములో భూలోక విశ్వాసులును పరలోక వాస్తవ్యులను, దేవదూతలును మాకు సహాయకారులుగా ఉండుటకు ఏర్పరుచుచున్నావని నమ్ముచు నిన్ను వందించుచ్నున్నాము. ఆకాశజ్యోతులు అందరికి కనబడురీతిగా బైబిలుమిషను కనబడునట్లు చేయుదువని నమ్ముచు నిన్ను నమస్కరించుచున్నాము.

10. మాకు కలుగుచున్న అవమానములను, నేరాస్థపనలను మా విశ్వాస వృద్ధికొరకు, సర్వజనుల మేలుకొరకును, నీ మహిమ కొరకును మార్చగలవని నమ్ముచు నిన్ను స్తుతించుచున్నాము.

11. ప్రభువా! సంస్కార భోజన పాఠములను, రెండవ రాక పాఠములును, ఇతర పాఠములను మాకు నేర్పించుచున్నందుకు నిన్ను ఆరాధించుచున్నాము. దేవా! మేము అడిగినవాటికంటే ఎక్కువ

చేయుదువని నీ దివ్య లక్షణములను నీ వాగ్ధానములను మా అనుభవములనుబట్టి నమ్ముచు నీమీద ఆధారపడుచున్నాము స్తోత్రము. నీవు స్థాపించిన సంఘము మూలముగాను, నీవు బైలుపరచిన బైబిలుమిషను మూలముగాను, సన్నిధికూటముల మూలముగాను, మా పత్రికాదుల మూలముగాను నెరవేరవలసిన పనులన్నియు సంపూర్తిగా నెరవేర్తువని నమ్ముచు నిన్ను ఘనపర్చుచున్నాము.

12. దేవా! కడవరి తీర్పు రాకముందు ప్రతివారికిని సుళువుగా బోధపడునట్లు నీ సువార్త అందించుదువని నమ్ముచు నిన్ను మహిమపరచుచున్నాము.

13. ఈ ప్రార్ధనలుకాక ఇంకను మిగిలియున్న ప్రార్థనాంశములుకూడ నీవు పూర్తిచేయునట్లు మేము నీకు అర్పించుచున్న సమర్పణ అంగీకరింతువని నమ్ముచు నిన్ను శ్లాఘించుచున్నాము. ఈ మా ప్రార్ధనలు భూమండలముకంటెను, ఆకాశమండలముకంటెను ఎక్కువగానుండి సఫలమౌటకై నీ ప్రియకుమారుడను, మా ప్రాణ రక్షకుడునైయుండి అతిశీఘ్ర కాలములో రానున్న ప్రభువునుబట్టి ఆలకింతువని ఆనందించు చున్నాము. ఆమెన్.

## సన్నిధిపరులు చేయవలసిన ప్రార్థనలు

1. దేవా! నీవు సైతానును, ఆదిసర్పమును, ఘట సర్పమును ఆ ఎర్ర సర్పమును ఏడేండ్ల శ్రమకాలమందు మట్టులేని ఆగోతిలో పాతాళ లోకములో బంధింపనైయున్నావు. గనుక నీకనేక నమస్కారములు. దానికి ముంగుర్తుగా ఇప్పుడే న్యాయపద్ధతిని ఎంతగా బంధింపవలెనో అంతగా బంధించుము ఆమేన్.

2. దేవా! సైతానుయొక్క జట్టువారైన చెడ్డదూతలను, చివరకు నరకములో పడవేయుదువు గనుక నీకు నమస్కారములు. ఆ పనికి ముంగుర్తుగా ఇప్పుడు న్యాయపద్ధతిగ పనిచేయుము ఆమేన్.

3. సైతానుయొక్క అనుచరులు, అతని ప్రేరేపణవలన అతనితోపాటు చెలరేగియున్నారు. వారినికూడ ఏడేండ్ల శ్రమ కాలములో ఆపుచేస్తావు గనుక నమస్కారములు. దానికి ముంగుర్తుగా ఇప్పుడు న్యాయపద్ధతిని ఆపుచేయుము ఆమేన్.

4. ఏడేండ్ల పరిపాలనాంతమందు అంతెక్రీస్తును నరకములో పడవేయుదువు నమస్కారము. ఇప్పుడుకూడ అంతెక్రీస్తువంటివారు మనుష్యులలోకూడ ఉన్నారు. వారు నీ విరోధులు దానికిముంగుర్తుగా ఇప్పుడు వీరిని పడవేయుము ఆమేన్.

5. ఏడేండ్ల చివర అబద్ధ ప్రవక్తలను నరకములో పడవేయుదువు. అతనివలె తప్పుబోధలుచేసే అబద్ధ ప్రవక్తలు ఇప్పుడు ఉన్నారు. దానికి ముంగుర్తుగా న్యాయపద్ధతిని వీరినికూడ పడవేయుము ఆమేన్.

6. ఏడేండ పరిపాలనలో మెడ వంచనివారు శ్రమలలో సహితము మారుమనస్సు పొందనివారు మరణమౌదురు. ఆ మృతులు సజీవులకు ఆటంకముగా నుండకుండ చేయుదువు. నమస్కారములు దీనికి ముంగుర్తుగా న్యాయపద్ధతిని మరణమగు చున్నారు.

7. మానవులనందరిని దైవభక్తులుగా చేయుటకై ఏడేండ్ల శ్రమకాలములో ఎండవల్ల, నీళ్ళవల్ల, జంతువులవల్ల, కరువులవల్ల బాధలు కలిగించెదవు నమస్కారము. దీనికి ముంగుర్తుగా ఇప్పుడుకూడా బాధలు కలిగించుచున్నావు నమస్కారములు.

8. వెయ్యేండ్ల పరిపాలనలో నైజపాపము కలవారు అనేకమంది ఉంటారు. వారి గతి ఏమగునో మీకే తెలుసు. ప్రభువా! నీవు న్యాయము చేస్తావు గనుక నమస్కారము. ఇప్పుడు కూడా దీనికి ముంగుర్తుగా న్యాయపద్ధతిని న్యాయము చేయుము ఆమేన్.

9. హేడెస్సులో మారుమనస్సులేని మృతులు అనేకమంది ఉన్నారు. వారి విషయములో నీవు న్యాయము కృప చూపిస్తావు. గనుక

నమస్కారములు. ఇప్పుడుకూడా అట్టివారు భూమిమీద ఉన్నారు. వారి న్యాయపద్ధతిని నీ ఇష్టమువచ్చినట్లుగా నడిపించుము ఆమేన్.

10. ప్రభువా! కడవరి తీర్పు రాకముందు భూలోములో ఉన్న ప్రతివారికిని, హేడెస్సులోనున్న ప్రతివారికిని నీ సువార్త పూర్తిగా వినిపించుము ఆమేన్.

11. పిశాచియొక్క దుష్ట ప్రయత్నములన్నిటిని సమూలముగా నాశనముచేయుము ఆమేన్.

12. తండ్రీ! నీ విశ్వాసులు అభిమానులు చేయుచున్న మంచి పనులన్నిటిని వృద్ధిలోనికి తీసికొనిరమ్ము ఆమేన్.

13. ఓ తండ్రీ! 1938 సం॥లో ప్రత్యేకమైన మా బైబిలు మిషనును స్థాపించియున్నావు గనుక దీని విషయములో నీకుగల ఉద్దేశములన్నిటిని అంచీలమీద నెరవేర్చుము ఆమేన్.

14. ప్రత్యక్షమగుచున్న మా తండ్రీ! సృష్టిద్వారా, మానవ జ్ఞానముద్వారా, బైబిలుద్వారా, క్రీస్తుప్రభువుద్వారా, సంఘము ద్వారా బైలుపడుచున్న తండ్రీ! నీకు అనేక నమస్కారములు. బైబిలు మిషనుద్వారా ఇంక ఎక్కువగా బైలుపడుచున్న తండ్రీ! నీకు అనేక వందనములు. ఈ మిషను పత్రికలద్వారా, స్వస్థిశాలలద్వారా బైలుపడుచున్న తండ్రీ! నీకు నమస్కారములు. సన్నిధి కూటముల ద్వారా శరీర రూపములో కనబడి మాటలాడుచున్న తండ్రీ! నీకు అనేక నమస్కారములు.

15. సువార్త సంపూర్తిగా బోధించే బోధకులను ప్రతి దేశములో లేపుమని వేడుకొనుచున్నాము.

16. ప్రభువుయొక్క రాకడను గురించి, ప్రతి దేశములో బోధకులను లేపుమని వేడుకొనుచున్నాము.

17. బైబిలుమిషను పైకెత్తి చూపించగల ప్రముఖులను లేపుమని వేడుకొనుచున్నాము ఆమేన్.

18. బైబిలు గ్రంథము 1400 భాషలలో తర్జుమా చేయించినందుకు నమస్కారములు. మిగతా చిన్న చిన్న భాషలలో కూడా తర్జుమా చేయించుమని వేడుకొనుచున్నాము ఆమేన్.

19. మనుష్యులు క్రొత్త క్రొత్త విషయములు కనిపెట్టు చున్నారు. విమానముకూడా చేసే విధానములు కనిపెట్టినారు ఏ పద్ధతిని కనిపెట్టిన యెడల ప్రతి మనుష్యునికి సువార్త అందునో ఆ పద్ధతిని కనిపెట్టుటకు కొంతమందిని లేపుము ఆమేన్.

20. లోకములో జరుగుచున్న యుద్ధములకు, పాఠశాలలకు ఇంకా అనేకమైన పనులకు నీవు ఎన్నో కోట్ల రూపాయలు ఇస్తున్నావు. నీకు నమస్కారములు అలాగే సువార్త ప్రకటించుటకు అంతకంటే ఎక్కువ కోట్లసొమ్ము నీ సంఘమున కిమ్మని వేడుకొనుచున్నాము ఆమేన్.

21. తండ్రీ! పాపులకు, రోగులకు, బీదలకు, గొడ్రాండకు, పసిపిల్లలకు, భర్తపోయిన వారికి, భార్యపోయినవారికి, అన్యాయము అనుభవించుచున్నవారికి శాంతము కల్గునట్టి పనులు ఇంకా ఎక్కువగా చేయించుమని వేడుకొనుచున్నాము ఆమేన్.

22. ఓ తండ్రీ! ఆకాశమందలి జ్యోతులలోనికి వెళ్ళవలెనని కొందరు ప్రయత్నించుచున్నారు. మరికొందరు భూగర్భంలోనికి పనులు చేయుటకై వెళ్ళుచున్నారు. దిగి పనిచేయుటకై వెళ్ళుచున్నారు. మరికొందరు సముద్రములో ఇట్లు అపాయకరమైన పనులు చేయుటకు ప్రయత్నించుచున్న ప్రతివారికి నీవు తోడైయుండుమని వేడుకొనుచున్నాము ఆమేన్.

23.తండ్రీ! నీవు స్థాపించిన క్రైస్తవ సంఘములో 350 మిషనులు వచ్చినవి. ఇవి ఇతర మతస్థులకు మాదిరికాదు అన్ని మిషములు ఒకటి అగునట్లు చేయుమని వేడుకొనుచున్నాము.

24. తండ్రీ! వేలగొర్రెలమంద నాకున్నదనియు వాటిని తోడుకొని రావలయునని నీవాక్యములో వ్రాయించినావు గనుక ఇతర

మతముల వారినందరిని తోడుకొని రమ్మని వేడుకొను చున్నాము. ఆమేన్.

25. నీ బైబిలును, యేసుప్రభువును, క్రైస్తవసంఘమును కొందరు విమర్శించుచున్నారు. ఈ పనివారు తెలియకయే చేయుచున్నారు. గనుక క్షమించుమని వేడుకొనుచున్నాము. మరియు వారు నమ్మినను నమ్మకపోయినను సరే వారికి తేటపర్చుమని మా ప్రార్థన ఆమేన్.

26. లోకసంబంధమైన విషయములో క్రొత్తవి ఏ ప్రకారముగా బైలుపర్చుచున్నావో ఆ ప్రకారముగానే నీ విషయములను క్రొత్త విషయములను మాటిమాటికి బైలుపర్చుమని వేడుకొనుచున్నాము ఆమేన్.

27. తండ్రీ! నీవు కలుగజేసిన సూర్య,చంద్ర నక్షత్రములను భూమండలమును, పక్ష్యాదులను, పశ్వాదులను, జలచరములను, పురుగులను, చెట్లను, కొండలను, జలములను, గాలిని ఈ మొదలైన వాటిని అనుదినము దీవించుమని వేడుకొనుచున్నాము ఆమేన్.

28. తండ్రీ! మేము అడిగినవాటన్నిటికంటేట ఎక్కువే దయచేయుమని వేడుకొనుచున్నాము. ఆమేన్.

29. తండ్రీ! యేసుప్రభువుయొక్క రెండవ రాకడ ఎంత త్వరగా వస్తున్నదో అంత త్వరగా శుద్ధికార్యమును వృద్ధి కార్యములు సాగించుమని వేడుకొనుచున్నాము ఆమేన్. మరనాత.

# వాగ్దాన మంజరి

గ్రంథకర్త
యం. దేవదాసు అయ్యగారు

గుంటూరు -2025
చందా : 6.00

Bible Mission HQ Guntur

| | | | | |
|---|---|---|---|---|
| మొదటి | ముద్రణ | 1976 | ప్రతులు | 1000 |
| రెండవ | ముద్రణ | 1981 | ప్రతులు | 1000 |
| మూడవ | ముద్రణ | 1982 | ప్రతులు | 1000 |
| నాల్గవ | ముద్రణ | 1986 | ప్రతులు | 1000 |
| ఐదవ | ముద్రణ | 1992 | ప్రతులు | 4000 |
| ఆరవ | ముద్రణ | 1998 | ప్రతులు | 5000 |
| ఏడవ | ముద్రణ | 2012 | ప్రతులు | 2000 |
| ఎనిమిదవ | ముద్రణ | 2018 | ప్రతులు | 3000 |
| తొమ్మిదవ | ముద్రణ | 2020 | ప్రతులు | 3000 |
| పదవ | ముద్రణ | 2024 | ప్రతులు | 1000 |
| పదకొండవ | ముద్రణ | 2025 | ప్రతులు | 1000 |

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బయలు పరచిన

# బైబిలు మిషను ప్రచురణ

ముద్రణ :

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.

ఫోన్ : 9949121777.